VISALAANDHRA VIJAYAWADA PHONE No. 376

701254

4 పేజీలు 7 నయాపైసలు [illegible]

విశాలాంధ్ర

సంపుటి 12 | విజయవాడ • 13 ఆగస్టు 1962 • సోమవారం [సంచిక 129

'విశాలాంధ్ర' పత్రిక

చందా వివరాలు

	ఏజెంటుద్వారా	పోస్టుద్వారా
సంవత్సరం ...	28.00 ...	30.00
ఆరు మాసాలు ...	14.00 ...	15.00
మూడు మాసాలు ...	7.00 ...	7.75
ఒక మాసం ...	2.40 ...	2.60

ఊటీ ముడి ఫిల్ము ఫ్యాక్టరీ
వచ్చే సంవత్సరం నుండి ఉత్పత్తి ప్రారంభం

మద్రాసు, ఆగస్టు 12

ఒకటిన్నర కోట్ల రూపాయల ఖర్చుతో ఊటీలో నిర్మించుతున్న ముడి ఫిల్ము ఫ్యాక్టరీ 1963 మార్చి నాటికి పూర్తి అవుతుందని నేడిక్కడ తెలుస్తున్నది. వచ్చే సంవత్సరం మధ్యనుంచి ఆ ఫ్యాక్టరీ ఉత్పత్తి ప్రారంభించగలదు.

రోదసిలో నాలుగవ సోవియట్ పౌరుడు

నిన్నవెళ్లిన నికొలయెవ్ సురక్షితం; నేడు పోపోవిచ్ యాత్రారంభం

పరిశోధనా కార్యక్రమాన్ని జయప్రదంగా సాగిస్తున్నట్లు నికొలయెవ్ సందేశం

మాస్కో, ఆగస్టు 11

మూడవ సోవియట్ రోదసి యాత్రికుడు మేజర్ ఆండ్రియన్ నికొలయెవ్ తన "వోస్తాక్ 3" అంతరిక్ష నౌకలో మాస్కో కాలమానం ప్రకారం నేటి రాత్రి 10 గంటలకు భోజనంచేసి నిద్రపోతున్నారని మాస్కో రేడియో ప్రకటించింది అప్పటికి వోస్తాక్ 7 సార్లు భూమిని చుట్టివచ్చింది. ఈ నౌక మూడు రోజులు రోదసిలో పరిభ్రమించ వచ్చునని అక్కడి వార్తలు సూచిస్తున్నాయి. రోదసిలో పరిశోధన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తున్నానని నికొలయెవ్ సందేశం పంపారు.

'వోస్తాక్'లో రాత్రి భోజనంచేసి నికొలయెవ్ నిద్రపోతున్నారని మాస్కో రేడియో నేటి రాత్రి ప్రకటించింది. నికొలయెవ్ ఇప్పటికి మూడు పూటలు — ఉదయం, మధ్యాహ్నం, రాత్రి — భోజనం చేశారు. ఆయన కృత్రిమ ఆహార పదార్థాలను కాక మామూలు ఆహార పదార్థాలనే భుజించారు. మామూలు ఆహారాన్ని అంతరిక్ష యాత్రికునికివ్వడం ఇది మొదటిసారి. తనకు ఆకలిగానే ఉన్నట్లు నికొలయెవ్ తెలియజేశారు. మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత కూడ నికొలయెవ్ ఒక గంట సేపు విశ్రాంతి తీసుకున్నారు. నికొలయెవ్ నిశ్చిత ~~[illegible]~~ రాత్రి మాస్కో కాలమానం ప్రకారం 10 గంటలకు (గ్రీనిచ్ కాలమానం ప్రకారం రాత్రి 7 గంటలు) నిద్రపోయారని టాస్ ప్రకటించింది అప్పటికి ఏడు సార్లకు పైగా నౌక భూమినిచుట్టి వచ్చింది. అంటే ఒక లక్ష 86 వేల మైళ్ళు ప్రయాణించిందన్నమాట.

అంతరిక్ష నౌకలో అంతా సక్రమంగానే ఉన్నదని మాస్కో రేడియో తన ప్రకటన ముగించింది. రేపుదయం తిరిగి వోస్తాక్ వార్తలు ప్రసారం చేయబడతాయని తెలిపింది.

నికొలయెవ్ అంతరిక్ష సంచారం మూడు రోజులు సాగవచ్చునని ఇక్కడ వార్తలు వెలువడ్డాయి. కాని ఇది ధృవీకరింపబడలేదు. వోస్తాక్ గంటకు 18 వేల మైళ్ళ వేగంతో పరిభ్రమిస్తున్నది. రెండు మూడు రోజులు వోస్తాక్ కక్ష్యలో ఉన్నట్లయితే 30 నుంచి 50 పర్యాయాలు భూప్రదక్షిణ చేసినట్లవుతుంది.

టెలివిజన్ లో నికొలయెవ్

వోస్తాక్ లో అమర్చబడిన టెలివిజన్ కెమేరాలు చిత్రీకరించిన దృశ్యాలను సోవియట్ టెలివిజన్ కార్యక్రమంలో ప్రసారంచేశారు. భారరహిత స్థితిలో తేలాడుతున్న ఒక పెన్సిల్ ను నికొలయెవ్ పట్టుకోవడం ఈ దృశ్యాలలో ఒకటి.

దక్షిణ అమెరికా మీదుగా ప్రయాణించినప్పుడు పర్వతాలను, నదులను, రహదారులను చూశానని నికొలయెవ్ తెలియజేశారు. పరిశోధనల కార్యక్రమాన్ని తాను విజయవంతంగా పూర్తిచేస్తున్నట్లు నికొలయెవ్ తెలిపారని టాస్ ప్రకటించింది. ఆయన కులాసాగా ఉన్నట్లు తెలిపింది. రోదసీ క్యాబిన్ లో ఉష్ణోగ్రత 25 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉంది. గాలి ఒత్తిడి, తేమ మామూలుగా ఉన్నాయి. రోదసి నౌక యంత్రాలన్నీ చక్కగా పని చేస్తున్నాయని టాస్ వెల్లడించింది.

నికొలయెవ్ చోదకత్వం

నికొలయెవ్ రెండుసార్లు స్వయంగా అంతరిక్ష నౌక చోదకత్వం వహించారు. నౌకామార్గాన్ని ఆయన మామూలుగా మార్చగలిగారు. భారరహితస్థితిని పరీక్షించడానికి ఆయన తన స్థానాన్ని విడిచి రోదసీమందిరంలో అటూ ఇటూ తిరిగారు. భారరహిత స్థితిలోకూడ తనపని తాను చేసుకోగలుగుతున్నానని ఆయన తెలిపారు.

నికొలయెవ్ జీవిత విశేషాలు

ఆండ్రియన్ గ్రిగోరియేవిచ్ నికొలయెవ్ చువాష్ స్వయంపాలిత రిపబ్లిక్ లోని ఒక చిన్న గ్రామంలో 1929 లో పుట్టారు. సమష్టి వ్యవసాయ క్షేత్రంలో రైతుగా ఉండిన ఆయన తండ్రి 1944 లో మరణించారు. నికొలయెవ్ మొదట డాక్టర్ అవుదామని అనుకొన్నారు. ఒక వైద్య విద్యాలయంలో చేరారుకూడ, కాని తరువాత ఒక కలప పరిశ్రమలో ఫోర్మన్ గా చేరారు. తరువాత యుద్ధంలో చేరి సైనికుడిగా స్థిరపడ్డారు.

1957 లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. ఒక ప్రభుత్వ ఆదేశాన్ని విజయవంతంగా అమలు జేసినందుకు ఆయనకు గతసంవత్సరం "అరుణతార" పతకాన్ని ఇచ్చారు. నికొలయెవ్ కు ఇంకా వివాహం కాలేదు.

తొలి వార్తలు

మాస్కో, ఆగస్టు 11

"వోస్తాక్-3" అను అంతరిక్ష నౌకను రోదసిలోనికి ప్రయోగించిన 24 గంటలకు ఈ నౌక ఎట్టి అంతరాయం లేకుండా భూప్రదక్షిణం చేస్తున్నట్టుగా సోవియట్ వార్తాసంస్థ 'టాస్' తెలియజేసింది.

అంతరిక్ష నౌకలో అమర్చబడిన పరికరాల ఏర్పాట్లు అన్నీ సక్రమంగా, ఖచ్చితంగా పనిచేస్తున్నాయనీ, ఎయిర్ కండిషన్ పద్ధతి నిర్ణీత పరిమితుల్లో ఉష్ణోగ్రత, ఒత్తిడి, గాలిలో తేమ తగ్గకుండా సక్రమంగా పని చేస్తున్నదని 'టాస్' ప్రకటించింది.

అంతరిక్ష యాత్రికుడు మేజర్ నికొలయెవ్ భూమిమీదికి పంపిన టెలివిజన్ చిత్రాలనుబట్టి, ఆయన క్షేమంగా వున్నట్టుగా 'టాస్' తెలియజేసింది.

అంతరిక్ష నౌక భూమధ్య రేఖకు 65 డిగ్రీల కక్ష్యలో తిరగడానికి నిర్ణయించబడింది.

అంతరిక్ష నౌకలో సంకేత ప్రసారా

(మిగతా 8 వ పేజీలో)

హైదరాబాద్ కు మరికొందరు కమ్యూనిస్టు నాయకుల రాక

హైదరాబాద్, ఆగస్టు 12

భారత కమ్యూనిస్టుపార్టీ జాతీయ సమితి సమావేశం జరుగుతున్న సందర్భంలో మరికొందరు కమ్యూనిస్టు నాయకులు యిక్కడికి నిన్న, ఈవేళ వచ్చారు.

వారిపేర్లు: శ్రీయుతులు జగ్ జిత్ సింగ్ లాయల్ పూరి, ఎస్. ఎల్. ఉపాధ్యాయ, హెచ్. కె. వ్యాస్, డాక్టరు అధికారి, రమేశ్ చంద్ర, ఎమ్. ఆర్. వెంకట్రామన్, ఫణిబోస్, హరేకృష్ణ కోనార్, ప్రమోద్ దాస్ గుప్తా, ఖాండేకర్, ఫరూఖీ, దినకర్ మెహతా, పి. రామమూర్తి, యస్. జి. సర్దేశాయ్, పి. సి. జోషీ, భవాని సేన్, భూపేశ్ గుప్తా, యస్. వి. ఘాటే, యస్. ఎ. పరులేకర్.

ఎర్నాకుళం ఆగస్టు 12

కేరళ వేజ్ బోర్డు అధ్యక్షులు శ్రీ పి. కె. కుంజు (యం. యల్. ఎ.) నేడొక ప్రకటనచేస్తూ కేరళ ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా తాను సహాయం చేస్తానని వాగ్దానం చేశాననీ దానిని అమలు చేయలేదని కొన్ని పత్రికలలో అసత్యవార్తలు, నిందలు తనపై చెలరేగుతున్నవనీ, అవి అన్నీ అబద్ధమని అన్నారు.

ఈ యేటినుండే కాంగ్రెసు ఎన్నికల కార్యక్రమం

న్యూఢిల్లీ, ఆగస్టు 12

గత ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోయిన స్థానాలను గెలుచుకొనేందుకై వచ్చే జనరల్ ఎన్నికల పనిని వచ్చే 12 నెలల్లోనే ప్రారంభించాలని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ నేడు నిర్ణయించింది.

ప్రధాని నెహ్రూ గృహంలో నేటి సమావేశం [illegible] గంటలపాటు జరిగింది.

ఓడిపోయిన నియోజకవర్గాల్లో కాంగ్రెసు అభ్యర్థులను వచ్చే సంవత్సరం జూన్ నెలాఖరుకల్లా నిర్ణయించాలని సమావేశం తీర్మానించింది. ఆ విధంగా ఆ నియోజకవర్గాల్లో బాగా ప్రచారం సాగించాలని నిర్ణయించింది.

ఎన్నికలకు కొన్ని సంవత్సరాలు ముందుగానే అభ్యర్థులను నియమించితే ఫిర్యాదులు రావని శ్రీ నెహ్రూ సూచించారు.

మధ్యప్రదేశ్ కాంగ్రెసు కమిటీని రద్దుచేస్తూ తీసుకొన్న చర్యను సమావేశం ఆమోదించింది.

అణ్వాయుధాలకు, అణు పరీక్షలకు వ్యతిరేకంగా గాంధీ శాంతి మండలిలో కాంగ్రెసు సహకరించి పని చేయాలని సమావేశం తీర్మానించింది.

అర్జంటైనా పరిస్థితులు

బ్యూనోస్ ఎయిర్, ఆగస్టు 12

నిన్న ఇక్కడ ఏర్పడ్డ అంతర్యుద్ధ పరిస్థితులు నేడు సైనికులు ప్రెసిడెంటు జోస్ మారియా గైడో ఆజ్ఞలను శిరసావహించి తమతమ స్థానాలలోకి వెళ్ళడంతో నేడు మెరుగయ్యాయి.

అధ్యక్షుని ప్రకటన నిన్న రాత్రి అతను తాను మూడవ సైనిక కార్యదర్శిగా నాలుగురోజులలోగా జనరల్ జువాన్ ఓక్టావియో కొర్నెజోను నియమించుతానని చేసిన ప్రకటనతోపాటు వెలువడింది.

ఈ క్రొత్తఉద్యోగ నియామకాన్ని జనరల్ ఫెడరికో టోరంజో మొంటెరో, ఆమోదించాడు. అయితే సైనిక కార్యదర్శి జనరల్ జువాన్ బాటిస్టా లోజాకు వ్యతిరేకంగా గత బుధవారంనాడు తిరుగుబాటు లేవదీశాడు.

కమ్యూనిస్టుపార్టీ కార్యవర్గ సమావేశం

హైదరాబాద్ లో ప్రారంభం: ఎజెండాపై విలేకరులకు శ్రీ నంబూద్రిపాద్ వివరణ

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, ఆగస్టు 11

భారత కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కార్యవర్గసమావేశం నేడిక్కడ ప్రారంభమైంది.

కార్యవర్గంలో వున్న 31 మంది సభ్యులతోపాటు మరో నలుగురిని సమావేశానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు.

సమావేశానికి 27 గురు హాజరయ్యారు. శ్రీ ముజఫర్ అహమ్మద్, డాక్టర్ జడ్. ఎ. అహమ్మద్, శ్రీ ఎ. కె. గోపాలన్, శ్రీ చండ్ర రాజేశ్వరరావు మరికొందరు అనివార్య కారణాలవలన సమావేశానికి హాజరు కాలేదు.

నేటి రాత్రి పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ నంబూద్రిపాద్ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ, సోవియట్ కమ్యూనిస్టుపార్టీ 22వ మహాసభ అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ సమస్యలపై చేసిన తీర్మానాన్ని కార్యవర్గం చర్చించి తయారు చేసిన ముసాయిదా తీర్మానాన్ని పార్టీ జాతీయ సమితి ఆమోదానికి ప్రవేశ పెట్టగలరని తెలియజేశారు.

ఇంతకు ముందు ప్రకటించబడిన ఎజెండాయేగాక, దేశ వ్యాపితంగా జరుగుతున్న పన్నుల వ్యతిరేక ఉద్య

(మిగతా 8 వ పేజీలో)

"పూర్తివేతనం ఇస్తేనే పూర్తి పనిసాధ్యం"

ప్రాగా కార్మికుల సభలో భారత కార్మిక నాయకుడు శ్రీ డాంగే ప్రసంగం

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, ఆగస్టు 12

పెరిగిన సంపద, లాభాలలో కార్మికులకు తగు వాటా లభించే పక్షంలో యీ మూడవ ప్రణాళికా కాలంలోనే ఉత్పత్తిని పెంచాలని కార్మికులు వాంఛిస్తున్నారని నేడు ఉదయం ఇక్కడ ప్రాగాటూల్స్ ఫ్యాక్టరీ కార్మికసభలో ప్రసంగిస్తూ అ. భా. ట్రే. యూ. కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్. ఎ. డాంగే చెప్పారు.

కార్మికులకు పూర్తి వేతనం కల్పిస్తే పూర్తిగా పనిచేస్తారనీ, సగం వేతనమిస్తే సగం పనికే [illegible] అంటూ శ్రీ డాంగే ఇంకా యిలా అన్నారు:

"గత ఐదు, పదేండ్ల కాలంలో ప్రభుత్వం తానేమీ చేశానని చెప్పుకుంటున్నా ప్రభుత్వ ప్రతినిధులే అంగీకరించిన సత్యం ఒకటుంది. ఒకవైపున లాభాలు పెరుగుతూంటే కార్మికుల నిజవేతనాలు తగ్గిపోయాయన్నదే ఆ వాస్తవం.

"వట్టి వాగ్దానాల్తో, ఆశీర్వాదాల వల్లనే ఉత్పత్తిని పెంచడానికి కార్మికులు ఉత్తేజితులు కారు. పూర్తి పని చేయాలంటే పూర్తి వేతనం యివ్వాలి. అప్పుడే పూర్తి ఉత్సాహంతో, సామర్థ్యంతో యీ మూడవ ప్రణాళికా కాలంలో పనిచేయగలరు. లాభాలతోపాటు వేతనాలను కూడా పెంచాలి. అది యీనాడు చేయకపోయినా రెండేండ్ల నాటికైనా చేయక తప్పదు.

ఈ సభ ప్రాగా ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన జరిగింది. దీనికి ఆ యూనియన్ అధ్యక్షుడు శ్రీ ఎన్. సత్యనారాయణరెడ్డి అధ్యక్షత వహించారు

శ్రీ డాంగే ఫ్యాక్టరీ ఆవరణలోకి రావడంతోటే "కామ్రేడ్ డాంగే జిందాబాద్, ఎ. ఐ. టి. యు. సి. జిందాబాద్, ప్రాగా ఎంప్లాయీస్ యూనియన్ జిందాబాద్" అనే నినాదాలు మిన్నుముట్టాయి.

ఫ్యాక్టరీ ఆవరణలోకి శ్రీ డాంగే రాగానే కార్మికుల జయజయ ధ్వానాలుమిన్నుముట్టాయి. "శ్రీ డాంగే జిందాబాద్" "ఏ. ఐ. టి. యు. సి. జిందాబాద్" అనే నినాదాలు చెవుల ఘూర్ణిల్లాయి.

లాభాలు పెరుగుతున్నప్పటికీ కనీస వేతనాలను అమలు జరపకపోవడం విడ్డూరమని, చెల్లించే శక్తి తమకు లేదని యజమానులు చెప్పడం సరికాదని శ్రీ డాంగే అన్నారు. అందుకే లాభాలెక్కడికి పోతున్నాయో పరిశీలించాలని ఇటీవల జరిగిన కార్మిక మహాసభలో ప్రతిపాదించామన్నారు.

శ్రీ డాంగే ప్రసంగిస్తున్నప్పుడు కరతాళ ధ్వనులు మధ్య మధ్య మారుమోగుతూనే ఉన్నాయి. పెట్టుబడిదారుల ప్రవర్తనపైన శ్రీ డాంగే చేసిన వ్యంగ్య విసురులకు పొట్టలు చెక్కలయ్యేట్లు నవ్వారు.

"వేతనాలు పెంచే శక్తి తమకు లేదని రుజువు చేసుకొనేందుకై యజమానులు అందజేసే బాలన్సుషీట్లను కార్మికులు, యూనియన్ నాయకులు నమ్మరాదని శ్రీ డాంగే చెప్పారు. "బాలన్సుషీట్లు బోగస్ గా తయారయ్యాయి. వాటిని ఏవిధంగానైనా తయారు చేయవచ్చు. లాభాలు వచ్చినా నష్టాలు వచ్చినట్లు చూపవచ్చు." అన్నారు శ్రీ డాంగే.

శ్రీ డాంగే ఇంకా ఇలా అన్నారు:

వర్గపోరాటం

"వర్గ పోరాటానికి కాలదోషం పట్టిందనుకొనడం తప్పు. సోషలిజం రానంతకాలమూ, పరిశ్రమల యాజమాన్యం కార్మికుల చేతుల్లోకి పూర్తిగా రానంతవరకూ వర్గపోరాటానికి విలువ ఉంటుంది. వర్గపోరాటమంటే ఎవరికెలాంటి భావాలున్నప్పటికీ ట్రేడ్ యూనియన్లే కార్మికుల ఆయుధం. వర్గపోరాటం ఎప్పుడో భవిష్యత్తులో వస్తుందనుకొనడం తప్పు. అది ఇప్పుడున్నది. అదొక చారిత్రక సత్యం. అది నేటి సమాజ లక్షణం."

ప్రాగా ఫ్యాక్టరీని ప్రస్తావించి శ్రీ డాంగే ఇలా అన్నారు.

"తక్కిన ఫ్యాక్టరీలకు ప్రాగా ఫ్యాక్టరీకి తేడా ఉన్నది. ఎందుకంటే యంత్రాలను తయారు చేసేందుకు ఉపయోగించే యంత్రాలను ఇక్కడ ఉత్పత్తిచేస్తారు. అందువల్ల ఇతర కార్మికుల ఉత్పత్తిశక్తి పెంచడానికి ప్రాగా కార్మికులు తోడ్పడుతున్నారు.

మేనేజిమెంటులో యూనియన్ కుదుర్చుకొన్న ఒప్పందం మంచిదే. దాన్ని అమలు జరిపితేనే కార్మికులకు ప్రయోజనం. అది అమలు జరగాలంటే కార్మికుల్లో ఐక్యత ఉండాలి. ట్రేడ్ యూనియన్లు సోషల్ క్లబ్బులు కావు అయితే సాంఘిక కార్యక్రమాలు సాగించడం ట్రేడ్ యూనియన్ కార్యకలాపాల్లో ఒక భాగం. ఒప్పందాన్ని అమలు జరిపించడానికి యూనియన్ ప్రధాన కార్యదర్శి బాధ్యుడని కార్మికులు తలంచరాదు.

యూనియన్ నిత్య కార్యకలాపాల్లో సభ్యులు చొరవతో పాల్గొనాలి. ఆవిధంగా కార్మికుల హక్కులను రక్షించేవిధంగా మేనేజింగ్ కమిటీ పనిచేసేలా చూడాలి

ట్రేడ్ యూనియన్ నాయకులు అవతారపురుషులేం కారు. [illegible] ఉద్యమంలోనే వాళ్లు తయారౌతారు.

పెట్టుబడిదారులు, మేనేజిమెంటు లేకపోయినా పరిశ్రమలు పని చేయగలవు కాని కార్మికులేకుండా పనిచేయజాలవు. యంత్రాలను నడప గలిగేది కార్మికులే. మరెవ్వరివల్ల కాదు. ప్రపంచ పారిశ్రామిక చరిత్ర గమనించితే పరిశ్రమలను కార్మికులు యాజమాన్యం వహించిన చోటనే సత్వరాభివృద్ధి జరిగిందని రుజువౌతున్నది.

పరిశ్రమల్లో పెట్టుబడిదారుల యాజమాన్యం ఎలా ఉంటుందంటే నీరుంటే విద్యుచ్ఛక్తి విఫలమౌతుంటుంది. విద్యుచ్ఛక్తి అందుతూంటే నీరు సప్లయి కాదు. రెండూవుంటే రోడ్లు మొదలైనవి పాడైపోయి రవాణా ఇబ్బంది కలుగుతాయి. అందువల్ల పరిశ్రమలు నిజంగా అభివృద్ధి చెందాలంటే సోషలిజం ఒక్కటే మార్గం. అప్పుడు పరిశ్రమలు కార్మికుల యాజమాన్యం క్రిందికి వస్తాయి."

అంతరిక్షంలో రెండు నౌకలమధ్య సరాసరి వార్తా సంబంధాలు

మాస్కో, ఆగస్టు 12

మరో అంతరిక్ష నౌక వోస్తాక్-4 ను సోవియట్ యూనియన్ నేడు రోదసిలోకి జయప్రదంగా పంపినట్లు సోవియట్ వార్తా సంస్థ "టాస్" ప్రకటించింది

ఈ అంతరిక్ష నౌకలో పావెల్ పోపోవిచ్ ప్రయాణం చేస్తున్నాడని "టాస్" ప్రకటించింది.

వోస్తాక్-4ను భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1-32 నిముషాలకు రోదసిలోకి పంపారు.

ఆండ్రియన్ నికొలయెవ్ తో వోస్తాక్-3 ని సోవియట్ యూనియన్ నిన్న రోదసిలోకి ప్రయోగించడం అది భూప్రదక్షిణం చేస్తూండడం పాఠకులకు తెలిసిందే.

జయప్రదంగా రోదసీయాత్ర చేసిన సోవియట్ పౌరుల్లో పోపోవిచ్ నాల్గవ వ్యక్తి.

నిన్న ప్రయోగించిన వోస్తాక్-3, వోస్తాక్-4 నౌకల మధ్య సరాసరి వార్తా సంబంధాలు ఏర్పాటు చేసినట్లు 'టాస్' ప్రకటించింది.

రెండు నౌకల మధ్య ప్రత్యక్ష సంబంధాలు ఏర్పాటుచేసే అవకాశాన్ని పరిశీలించడంకోసమే 2 నౌకలు సన్నిహితంగా ఉండేవిధంగా రోదసిలోకి ప్రయోగించడమైందని వార్తా సంస్థ చెప్పింది. అలాంటి ప్రత్యక్ష సంబంధాలు ఏర్పాటు చేయబడ్డాయని "టాస్" వెల్లడించింది.

వోస్తాక్-3 ప్రయోగించిన 24 గంటల తర్వాత వోస్తాక్-4ను ప్రయోగించారు.

ఇరువురు అంతరిక్ష యాత్రికులు కార్యకలాపాలను సమన్వయపరిచేందుకవసరమైన సమాచారాన్ని సేకరించడం, ఒకేరకమైన పరిస్థితుల ప్రభావం మానవులమీద ఎలా పడుతుందో తెలుసుకోవడం కూడ రెండు నౌకలను పంపడంలోని ఉద్దేశాల్లో ఒకటని "టాస్" తెలియపరిచింది.

ప్రతి 88.5 నిముషాలకొకసారి చొప్పున వోస్తాక్-4 భూప్రదక్షిణం చేస్తున్నది భూమికి అతిసన్నిహితంగా వచ్చినప్పుడు 111 మైళ్ళు, దూరంగా వెళ్ళినప్పుడు 158 మైళ్ళ ఎత్తున వోస్తాక్-4 ప్రయాణం చేస్తున్నది.

కర్నల్ పావెల్ రొమనోవిచ్ పోపోవిచ్ రోదసిలోకి ప్రయాణమయ్యేసరికి మేజర్ నికొలయెవ్ 15 ప్రదక్షిణలు చేశారు.

పోపోవిచ్ వయస్సు 32 సంవత్సరాలు. ఆయన ఉక్రెయిన్ రాష్ట్రంలో జన్మించారు. 1951వ సంవత్సరంలో ఆయన సైన్యంలో చేరారు. పోపోవిచ్ కు వివాహమైంది. ఆయన కొక కూతురు కూడా ఉన్నది. ఆయన భార్య పేరు మరియా.

రోదసియాత్రికులిద్దరూ కులాసాగా ఉన్నారని "టాస్" తెలియపరచింది.

భూమధ్యరేఖకు 65డిగ్రీల కోణంలో వోస్తాక్-4, వోస్తాక్-3 64 డిగ్రీల కోణంలోను ఉన్నాయి. వోస్తాక్-3 19.995 మెగా సైకిల్స్ పైనా, వోస్తాక్-4 19.990 మెగసైకిల్ పైనా వార్తాప్రసారాలు చేస్తున్నాయి.

రోదసి నౌకల్లోని అన్ని భాగాలు సక్రమంగా పనిచేస్తున్నాయని, చరిత్రలో మొట్టమొదటిసారిగా ఇద్దరు యాత్రికులు రోదసిలో సమిష్టి కార్యక్రమం నిర్వహించుతున్నారని 'టాస్' చెప్పింది.

బ్రిటిష్ శాస్త్రజ్ఞులకు వోస్తాక్-4 ద్వారా క్రుశ్చేవ్ సందేశం

జోడ్రల్ బాంకు, ఇంగ్లాండు, ఆగస్టు 12

బ్రిటిష్ ప్రధాన రేడియో [illegible] గారపు శాస్త్రజ్ఞులు నేడు సోవియట్ ప్రధాని క్రుశ్చేవ్ తరపు సోవియట్ ప్రజల తరపు వోస్తాక్ రోదసి నౌకనుండి పంపించిన అభినందనలను అందుకొన్నారు.

నేడు రోదసిలోకి పంపించబడ్డ కర్నల్ పావెల్ పోపోవిచ్ అన్నీ సక్రమంగా వున్నాయని అన్నారు. తాను అంతరిక్షయానం ఎలా చేస్తున్నదీ ఆయన వివరించారు.

వోస్తాక్-4 కు భూమితో రేడియో సంబంధాలు అంత సులభంగా ఏర్పడడంపట్ల ఇక్కడ శాస్త్రజ్ఞులు ఆశ్చర్యపోతున్నారు. వారు నిన్న ఎగరవేసిన వోస్తాక్ నుండి సంకేతాలు అందుకోవాలని ప్రయత్నించుకున్నారు.

ఛీఫ్ ఎలక్షన్ కమిషనర్ శ్రీ సుందరం ఆగస్టు 11న గవర్నరు శ్రీ పవార్ ను రాజభవన్ లో కలుసుకున్నారు.

పందిగుంట కాల్వకు అడ్డకట్టు నిర్మాణం

మంప పంచాయతీ ప్రజల ఆందోళన

మంప, ఆగస్టు 11

విశాఖజిల్లా మంప పంచాయతీ అధ్యక్షులు శ్రీ శంగుల రామన్నపడాల్ గారిలా ప్రకటిస్తున్నారు:

ఏజెన్సీ కొయ్యూరు సమితిలో చేరిన పంచాయతీలలో మంప పంచాయతీ ఒకటి. ఈ పంచాయతీ, ఏరియా లో "పందిగుంట కాల్వ" ~~[illegible]~~ కొండవాగుకు అడ్డకట్ట నిర్మాణం చేయమని ప్రభుత్వానికి పలుసార్లు తెలియ చేయడం జరిగింది. కాని ఇంత వరకు ఏమీ జరగలేదు. పైగా కించావాని పాలెం అనే చోట ల్యాండ్ కాలనైజేషన్ స్కీము పేరుతో సుమారు 60-70 వేల రూపాయలు ఖర్చు చేసి వదిలి పెట్టారు. కొసకు స్కీము ఎత్తివేయబడింది.

మంప గ్రామానికి పశ్చిమ దిశగా ప్రవహిస్తున్న పందిగుంట కాల్వకు అడ్డకట్ట నిర్మించితే సుమారు 800 ఎకరాల భూమికి నీరు అందగలుగుతుంది. కాబట్టి అడ్డకట్ట నిర్మాణానికి పూనుకోవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుచున్నాను.

చోడవరంలో బడివేళల మార్పు

తలిదండ్రుల సంఘం నిరసన

చోడవరం, ఆగస్టు 11

చోడవరంలోని బోర్డు హైస్కూల్ సెకండరి స్కూలు, బాలికల హైస్కూలు ఉదయపు తరగతులను 10 గంటలకు బదులు, 8 గంటలకే ప్రారంభించాలని జిల్లా పరిషత్తు చైర్మన్, విద్యాధికారులను కోరుతూ చోడవరం తలిదండ్రుల సంఘంవారు తీర్మానించారు. సంఘ సమావేశం శ్రీ కె. వి. రామేశం (అడ్వకేటు) అధ్యక్షతను జరిగింది.

హైస్కూలు ఉదయం 8 నుంచి 11 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు గత 30, 40 ఏళ్ళుగా పని చేస్తున్నది. ఈ వేళలు విద్యార్థులకు, తలిదండ్రులకు, ఉపాధ్యాయులకు సంతృప్తికరంగా ఉన్నాయి. కొత్తగా వేళలను మార్చడంవల్ల విద్యార్థులు, తలిదండ్రులు అనేక ఇబ్బందులకు లోను కావలసి వస్తున్నది. మధ్యాహ్నం ఏకొద్దినిముషాలో ఉండే ఇంటర్వెల్ లో ఊరికి 2 మైళ్ళ వెలుపల ఉన్న స్థలాలు నుంచి విద్యార్థులు భోజనానికి వచ్చి వెళ్ళడం సాధ్యంకాదు. అంచేత స్కూళ్లను 10 గంటలకు కాక ఎప్పటి వలెనే 8 గంటలకు తెరవాలని తీర్మానంలో కోరారు.

మద్రాసు మెయిలుకు కొద్దిలో తప్పిన ఘోర ప్రమాదం

(విశాలాంధ్ర విలేకరి)

నెల్లూరు, ఆగస్టు 12

నెల్లూరు రైల్వే స్టేషన్ ఉత్తర క్యాబిన్ వద్ద నేటి ఉదయం నాలుగు గంటలకు కలకత్తానుండి మద్రాసు వెళ్ళే మెయిలు బండికి ఘోరమైన ప్రమాదం కొద్దిలో తప్పిపోయింది.

రైలు ఇంజను చక్రాలను కలుపుతూ, సుమారు రెండు టన్నుల బరువుండే ముందుచక్రం ఇనపకడ్డీ విరిగినందునరెండు మూడు టన్నుల బరువుండే డ్రైవింగ్ చక్రం ఊడిపోయి 50 గజాలదూరాన విసిరికొట్టినట్లు పోయిపడ్డది.

ఇంజను ఇట్లు విరిగిపోవడమే పీనంటకి కారణం. ఇంజనుకు రెండు వైపులావుండే కడ్డీలు రెండూ వంగిపోయాయి. హఠాత్తుగా చక్రమూ, చక్రాలను కలిపే కడ్డీ విరిగిపోవడంవల్ల పెద్ద ధ్వని అయింది. ప్లాట్ ఫారం వద్దకు రైలు మెల్లగా వస్తున్నందువల్ల ప్రమాదం తప్పిపోయింది అ[illegible] జనూ, రైలు పడిపోకపోవటం [illegible] ఆశ్చర్యచకితులను చేసి[illegible] ఫారం మీదికి తెచ్చిన వి[illegible] చక్రాన్ని, అ[illegible] చూడడానికి జనం వచ్చి[illegible] న్నారు. మరో ఇంజను [illegible] నుండి ఉదయం 6-30 వచ్చింది. ఆ తర్వాత రైలు [illegible] బయలుదేరి వెళ్ళింది.

కృష్ణ నీటి మట్టం

విజయవాడ, ఆగస్టు [illegible]

కృష్ణానది నీటిమట్టం [illegible] వద్ద నేడు 11.15 అ[illegible]

నర్సాపురంసమితి సమావేశం నుండి 23 గ్గురి వాకౌట్

సమితి అధ్యక్షుని అక్రమచర్యకు నిరసన

నర్సాపురం, ఆగస్టు 10

మెదకుజిల్లా నర్సాపురం పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ జగన్నాధరావు అక్రమ చర్యకు నిరసనగా, ఈ నెల 7వ తేదీ సమితి సమావేశం నుండి 23 గ్గురు సభ్యులు వాకౌట్ చేశారు. వీరిలో మాజీ శాసన సభ్యుడు శ్రీ గుండం వీరయ్య తదితర కాంగ్రెస్ సభ్యులు, ప్రస్తుత శాసన సభ్యుడు శ్రీ విఠలరెడ్డి తదితర ప్రతిపక్ష సభ్యులు ఉన్నారు.

అంతకు క్రితంరోజు జరిగిన సమావేశానికి శ్రీ జగన్నాధరావు హాజరు కాలేదు. ఉపాధ్యక్షుడు శ్రీ నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు.

సమితి అధ్యక్షుడు శ్రీ జగన్నాధరావు సమితి సభ్యులకు తెలియకుండా, స్థాయీ సంఘం యొక్క ఆమోదం పొందకుండా, తనకు సంబంధించిన వారికి పబ్లిక్ బావులు మంజూరు చేశారని, కాబట్టి ఆ బావులకు ఇచ్చిన డబ్బు అధ్యక్షునినుండి తిరిగి వసూలుచేయాలని తీర్మానించారు.

అలాగే రమణరోడ్డు, కొత్తపల్లి పంచాయతీలో హరిజనవాడకు మంచి నీటి బావి నిర్మాణం గూర్చి మరో రెండు తీర్మానాలు చేశారు. సమావేశం మరునాటికి వాయిదాపడింది.

మరునాడు జరిగిన సమావేశానికి సమితి అధ్యక్షుడు శ్రీ జగన్నాధరావు అధ్యక్షత వహించారు.

చట్ట ప్రకారం సమితి కార్యక్రమం ప్రారంభించాలని ప్రతిపక్ష సభ్యులు శ్రీ లక్ష్మీనరసయ్యగారు అత్యవసర తీర్మానం ప్రవేశపెట్టారు. ఇది గాక చాల కాలం క్రిందట ఇచ్చిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని పదేపదే కోరినప్పటికీ అధ్యక్షుడు సమాధానమివ్వ నిరాకరిస్తూ, రూలింగ్ ఇచ్చారు. ఈ రూలింగ్ చట్టరీత్యా చెల్లనేరదని, తమ గౌరవానికి విరుద్ధంగా ఉన్నదని చాలమంది సభ్యులు మాట్లాడినప్పటికీ, అధ్యక్షుడు రూలింగ్ కొనసాగించారు. తత్ఫలితంగా సమావేశానికి హాజరైనసభ్యులు 31 మందిలో 23 గ్గురు (మొత్తం సభ్యుల సంఖ్య 42) ఒక్కుమ్మడిగా పార్టీ విభేదాలు లేకుండా వాకౌట్ చేశారు. వీరిలో మాజీశాసనసభ్యుడు శ్రీ గుండం వీరయ్య, శ్రీ హరికిషన్ తదితర కాంగ్రెసు సభ్యులు, ప్రస్తుత శాసనసభ్యుడు శ్రీ విఠలరెడ్డి, శ్రీ లక్ష్మీనరసయ్య తదితర ప్రతిపక్ష సభ్యులు ఉన్నారు.

వాకౌటు చేసిన తరువాత అధ్యక్షునితో కలిపి ఎనిమిదిమంది సభ్యులు మిగిలి ఉన్నారు.

చట్టప్రకారం మూడోవంతుసభ్యులు ఉన్నప్పుడే సమావేశ కార్యక్రమం కొనసాగించవలసివుండగా, అధ్యక్షుడు అందుకు విరుద్ధంగా ప్రవర్తించాడు.

సమితిసమావేశం జరుగుతున్నప్పుడు వాకౌట్ చేసిన సభ్యులపేర్లను, సమావేశానికి ఆలస్యంగా వచ్చిన సభ్యుల పేర్లను సభా కార్యక్రమంలో నమోదు చేయాలని, కార్యక్రమాన్ని కూడ ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలుపుతూ ఉండాలని ఇటీవల ఒక ఉత్తర్వు జారీ అయింది. కాని దీనిని అధ్యక్షుడు పాటించడంలేదు.

అధ్యక్షుడు స్థాయీ సంఘాల సమావేశాలు ఏర్పాటు చేయటం, సమావేశం జరిగే రోజు హాజరుకాకపోవడం, ఇంటివద్ద ఉండికూడా సమావేశాలకు హాజరు కాకపోవడంవల్ల సమావేశాలు చాల సార్లు వాయిదా పడ్డాయి. తత్ఫలితంగా సమితియొక్క అప్పులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. సమితి కార్యక్రమాలు ఆగిపోతున్నాయి. అభివృద్ధి కార్యక్రమాలు కూడ జరగడంలేదు. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి తెచ్చినప్పటికీ ఎలాంటి చర్య తీసుకోలేదు.

ఈ నెల 7వ తేదీనజరిగిన సమావేశం నుండి వాకౌట్ చేసిన 23 గ్గురు సభ్యుల సంతకాలతో జిల్లా కలెక్టరుకు ఒక మహజరు పంపబడింది. దీనిపై తక్షణ చర్య తీసుకోగలనని జిల్లా కలెక్టరు వాగ్దానం చేసినట్లు తెలుస్తున్నది.

సంత్ ఫతేసింగ్‌కు మాస్టర్ తారాసింగ్ లేఖ

అమృతసర్ ఆగస్టు 11

[illegible] ప్రాంతం సమస్యపైవున్న అకాలీ విభాగ కార్యకర్తలు సంత్ ఫతేసింగ్ కు పంజాయిషీని ఈ నెల [illegible] అందజేయాలని [illegible] అకాలీదళ్ అధ్యక్షులు మాస్టర్ తారాసింగ్ నేడు ఆదేశించారు. సంత్ ఫతేసింగ్ తనకు [illegible] సమస్యపై పౌర కార్యవర్గం ఒక విజ్ఞప్తిని [illegible] అందుకు పంజాయిషీ [illegible].

11-తేదీలోగా మాస్టర్ తారా [illegible] [illegible] ప్రతినిధులకు [illegible]

(సం.)

కమిటీ

కౌలు చెల్లింపు గడువు

పెంచవలసినదిగా కేరళ రైతు సంఘం విజ్ఞప్తి

పాల్ఘాట్, ఆగస్టు 10

కేరళ కౌలు దార్లు చెల్లించవలసిన భూమి కౌలుకు మరికొంత గడువు ఇస్తూ వెంటనే ఒక ఆర్డినెన్సును ప్రకటించవలసినదిగా కేరళ రాష్ట్ర కిసాన్ సంఘం ప్రతినిధుల సమావేశం నేడు తీర్మానించింది. కౌలు చెల్లించవలసిన గడువు ఈ ఆగస్టు 15వ తేదీతో అంతమవుతుంది.

కేరళ వ్యవసాయ సంబంధాల చట్టాన్ని సవరించాలనే సూచనపై వారు మరో తీర్మానం చేశారు. సవరణల వలన పెద్ద పెద్ద భూస్వాములకు మేలు కలుగుతుందేకాని చిన్న చిన్న భూఖామందులకుగాని, దేవాలయాలకుగాని మేలు చేకూరదని వారు అన్నారు.

కిసాన్ సంఘం ఉపాధ్యక్షులు శ్రీ ఇ. ఏ. కేరళయన్ సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశాన్ని శ్రీ ఎం. ఇ. షెట్టి ప్రారంభించారు. 500 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

అఖిలభారత కిసాన్ సంఘం కార్యదర్శి, సర్దార్ జగ్‌జిత్‌సింగ్ లాయల్‌పురి సమావేశానికి హాజరయ్యారు.

కాశీపూర్ వద్ద విమాన ప్రమాదం

వైమానికుని మృతి

న్యూఢిల్లీ, ఆగస్టు 11

మండుటంపలై కార్యక్రమంపై వెళ్ళిన వైమానిక సంస్థవారి విమానం ఒకటి నిన్న నైనిటాల్ జిల్లాలో కాశీపూర్ వద్ద కూలిపోయిందనీ, వైమానికుడు శ్రీ జె.యస్. శంకర్ చనిపోయాడనీ, పౌర వైమానికశాఖకందిన సమాచారాన్నిబట్టి తెలుస్తున్నది.

యు. పి. లో అధిక పన్నుల వ్యతిరేకోద్యమం

సెప్టెంబరునుండి ప్రారంభించాలని ప్రతిపక్షాల నిర్ణయం

లక్నో, ఆగస్టు 11

ఉత్తర ప్రదేశ్‌లో అధిక పన్నుల విధానానికి వ్యతిరేకంగా ఆందోళన ప్రదర్శనలు సెప్టెంబరు నెలలో ప్రారంభించాలని రాష్ట్ర ప్రతిపక్ష వర్గాలు నిర్ణయించుకున్నవి. సెప్టెంబరు నెలలో కౌన్సిల్ భవనంముందు ఒకనిరసనప్రదర్శన విషయమై వివిధ ప్రతిపక్ష పార్టీల మధ్య సంప్రతింపులు కొనసాగుతున్నాయి.

అధికపన్నుల వ్యతిరేక ఆందోళన ప్రారంభించుతామని ప్రజాసోషలిస్టు పార్టీ నాయకుడు శ్రీ చంద్రసింగ్, కమ్యూనిస్టు నాయకుడు డా. జడ్. ఎ. అహమద్ గారలు నేడిక్కడ అన్నారు.

ఈ ఆందోళన క్రమక్రమంగా సహాయ నిరాకరణ, సత్యాగ్రహ రూపాలు తీసుకోవచ్చునని వారన్నారు.

కమ్యూనిస్టు నాయకుడు మాట్లాడుతూ, తమ పార్టీ కొన్ని షరతులకు లోబడి ఇతర పార్టీలతో సహకరింపుతుందని అన్నారు. అయితే ప్రజాస్వామిక, జాతీయవాదుల బద్ధ విరోధులయిన జనసంఘం, స్వతంత్ర పార్టీలతో కలసి పనిచేయాలనే సూచనకు తమ పార్టీ వ్యతిరేకిస్తుందని ఆయన అన్నారు.

సెప్టెంబరు 8వ తేదీన జిల్లా స్థాయిలో పన్నుల వ్యతిరేక ప్రదర్శనలు జరపవలసిందిగా విజ్ఞప్తులు పంపామని ఆయన తెలియజేశారు.

రాష్ట్రంలో పంచదార ఫ్యాక్టరీలను జాతీయం చేసినట్లయితే కావలసినంత ధనం ప్రభుత్వానికి లభ్యం కాగలదనీ, అందువలన ప్రజలపై అదనపు పన్నులు వేయవలసిన అవసరం ప్రభుత్వానికి కలుగకుండా పోతుందనీ ఆయన సూచించారు.

పన్నులభారం అధికమవుతూ వస్తున్నది. ఇక ఏ మాత్రం పన్నులు అధికంగా విధించినా విపరీత పరిణామాలు రాగలవు.

డా. అహమ్మద్, రాష్ట్రంలో ఏ పరిశ్రమలను జాతీయం చేస్తే చాల లాభాలు చేకూరగలవో వివరించారు. జనపనార, తేయాకులాంటి సరుకుల ఎగుమతి, దిగుమతులను జాతీయం చేయడం కూడా లాభసాటిగా వుంటుంది.

ప్రజాసోషలిస్టు నాయకుడు శ్రీ చంద్రసింగ్ మాట్లాడుతూ పంచదార పరిశ్రమను జాతీయం చేయడం వలన తమ రాష్ట్రంలో ప్రభుత్వాదాయాన్ని మరింతగా పెంచుకో వచ్చునని సూచించారు.

రాష్ట్రంలోఅనేక పంచదార మహా పరిశ్రమలను సహకార ప్రాతిపదికపై నిర్మించారు. అందువలన ఉత్పత్తిదారులకు, పారిశ్రామికులకూ మధ్య వైరుధ్యాలన్నీ గిల్లిపోయాయి అని ఆయన అన్నారు.

ఆంధ్ర యూనివర్సిటీ ఎం.ఇడి. పరీక్షాఫలితాలు

వాల్తేరు, ఆగస్టు 12

1962 ఏప్రిల్‌లో జరిగిన ఎం. ఇడి. పరీక్షలలో ఈ క్రిందివారు ఉత్తీర్ణులయ్యారు.

పార్టు I (వ్రాత) 22.

పార్టు II (డిసర్టేషన్) 1284.

పింప్రీ కార్మికుల సమ్మె నోటీసు ఉపసంహరణ

పూనా, ఆగస్టు 11

పింప్రిలోగల హిందూస్థాన్ యాంటిబయాటిక్స్ ఫ్యాక్టరీ మేనేజిమెంటుకు లోగడ మజ్దూర్ సంఘం ఇచ్చిన సమ్మె నోటీసును నేడు ఉపసంహరించుకున్నది అని డా. [illegible]కర్, నేడిక్కడ అన్నారు. త్రిపక్ష సమావేశంలో ఒక ఒప్పందం కుదిరిన ఫలితంగా కార్మికులు ఇచ్చిన నోటీసు ఉపసంహరించుకోబడింది.

'సామ్రాజ్యవాదుల్లో మార్పు వచ్చిందనుకోవడం తప్పు'

ఘనా అధ్యక్షుడు నుక్రుమా స్పష్టీకరణ

ట్యూనిస్, ఆగస్టు 12

ఆసియా ఖండమూ, ఆఫ్రికాలో చాలభాగం విముక్తి పొందినా, సామ్రాజ్యవాదుల్లో మార్పువచ్చిందని తలంచడం తప్పు అని, వాళ్ళు ఆఫ్రికాలో ఇంకా చురుగ్గా పనిచేస్తున్నారని ఘనాఅధ్యక్షుడు నుక్రుమా నిన్న అన్నారు.

ట్యునీషియా వార పత్రిక 'జ్యూన్ ఆఫ్రిక్' లో ప్రకటితమైన వ్యాసంలో నుక్రుమా ఇంకా ఇలా వ్రాశారు:

"ఆసియా ఖండము, ఆఫ్రికాలో చాల భాగం విముక్తి పొందినంత మాత్రాన సామ్రాజ్యవాదులు మారారని భావించడం తప్పు.

ప్రస్తుతం వలసవాదులు అనుసరించే ఎత్తుగడలనుబట్టి ఆఫ్రికాలోసామ్రాజ్యవాదులు ఇంకా చురుగ్గా పనిచేస్తున్నారని విదితమౌతున్నది.

ఆఫ్రికా ఖండంలో అంతర్జాతీయరంగంలో ఆఫ్రికా ఐక్యతను నిలపడానికి ఆఫ్రికా జాతీయవాదులు ప్రయత్నించారు. కాని తెగలమధ్యగల తగాదావల్ల ఆఫ్రికా ఐక్యత చాలా దెబ్బతింటుంది. ఈ తగాదాలు వలసవాదులకు పెద్ద ఆయుధం. సామ్రాజ్యవాదుల స్వప్రయోజనాలకోసం దేశాన్ని ఎలా విచ్ఛిన్నం చేస్తారో కాంగో ఉదాహరణ రుజువు చేస్తున్నది.

'నవంబరులోగా హెచ్చుగా సభ్యత్వం చేర్పించండి'

రాయలసీమ ప్రాంత విద్యుచ్ఛక్తి సంఘంవిజ్ఞప్తి

గుంతకల్లు, ఆగస్టు 10

1962 నవంబరులోగా యూనియన్‌లోకి హెచ్చుమందిని సభ్యులుగా చేర్పించాలనీ, కార్మికులు విరివిగా సభ్యులుగాచేరి తమ సభ్యత్వాన్ని బ్రాంచి కమిటీలకు అందజేయాలని విజ్ఞప్తి చేస్తూ, ఆంధ్ర రాష్ట్ర విద్యుచ్ఛక్తి పనివారల సంఘం రాయలసీమ ప్రాంతీయశాఖ కార్యవర్గం తీర్మానించింది.

కార్యవర్గ సమావేశం ఇటీవల గుంతకల్లులో శాఖ అధ్యక్షులు శ్రీ పి. యస్. నాగేశ్వరరావు అధ్యక్షతను జరిగింది. సమావేశానికి రాష్ట్ర సంఘం అధ్యక్షుడు శ్రీ ఇ. యల్. నరసింహంగారు హాజరయ్యారు. సమావేశంలో సభ్యులు సంఘ పురోభివృద్ధికి సూచనలు చేశారు. కార్మికుల కోర్కెలు నెరవేరాలంటే కార్మికులను అన్ని విధాల చైతన్య పరచాలని సభ్యులకు శ్రీ నరసింహంగారు సలహాయిచ్చారు.

ప్రాంతీయశాఖ కోశాధికారి శ్రీ యస్. వి. రామమూర్తిగారు గుంతకల్లు నుండి బదిలీ అయినందువల్ల కోశాధికారిగా శ్రీ కృష్ణమూర్తి (లైన్ ఇన్స్పెక్టర్) గారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలు తిరిగి సభ్యులను చైతన్య పరచడానికి ప్రాంతీయశాఖ సహాయ కార్యదర్శి శ్రీ ఇ. ఆర్. వీరన్నగారిని ఆర్గనైజింగ్ కార్యదర్శిగాకూడ ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

విజయవాడలో జరిగిన 8వ మహాసభ తీర్మానాలను ఆమోదించారు.

కడపజిల్లా సమావేశం

ఆంధ్రరాష్ట్ర విద్యుచ్ఛక్తి పనివారల సంఘాధ్యక్షులు శ్రీ ఇ. యల్. నరసింహం (ఎం. పి.) గారి అధ్యక్షతను కడపజిల్లా విద్యుచ్ఛక్తి కార్మికుల సర్వసభ్యసమావేశం జూలై 27న జరిగింది.

సమావేశంలో కడప బ్రాంచి కార్యదర్శి శ్రీ ఇ. గంగిరెడ్డిగారు కార్మికుల ఇబ్బందులను వివరించారు. ఇంకా తదితర కార్మికులు చర్చలలో పాల్గొన్నారు. రాయలసీమ ప్రాంతీయశాఖ కార్యదర్శి శ్రీ ఎ. వెంకటేశం యూనియన్ కార్యకలాపాలను, విజయవాడలో జరిగిన 8వ మహాసభ తీర్మానాలను గురించి మాట్లాడారు. ప్రాంతీయశాఖ సహాయ కార్యదర్శి శ్రీ ఇ. ఆర్. వీరన్నగారు తీర్మానాలను ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించారు. తరువాత అధ్యక్షులు శ్రీ ఇ. యల్. నరసింహంగారు కార్మికుల కర్తవ్యాలను గురించి, పని నిపుణతకు తగినట్లు జీతాలకు, జి. కె. యం. ఆర్. కార్మికుల దినకూలిని పెంచాల్సిన అవసరాన్ని గురించి మాట్లాడారు.

తాడిపత్రి సమావేశం

అనంతపురంజిల్లా తాడిపత్రిలో జూలై 28న తాడిపత్రి విద్యుచ్ఛక్తి కార్మికుల సమావేశం శ్రీ గురుమూర్తి గారి యింటిలో జరిగింది. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఇ. యల్. నరసింహం(ఎం.పి.) రాయలసీమ ప్రాంతీయ శాఖ కార్యదర్శి, సహాయ కార్యదర్శులు శ్రీ ఎ. వెంకటేశం, శ్రీ ఇ. ఆర్. వీరన్న గారలు పాల్గొన్నారు. బ్రాంచి కార్యదర్శి, కోశాధికారి బదిలీ అయినందువల్ల యూనియన్‌కు శ్రీ గురుమూర్తి, కార్యదర్శిగా, శ్రీ యం. పాపిరెడ్డి కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. విజయవాడలో జరిగిన 8వ మహాసభ తీర్మానాలను ఈ సమావేశము ఏకగ్రీవంగా ఆమోదించింది.

అనంతపురం బహిరంగసభ

అనంతపురంలో జూలై 28న సాయంత్రం అనంతపురం జిల్లా విద్యుచ్ఛక్తి కార్మికుల సంఘం ఆధ్వర్యాన బహిరంగసభ జరిగింది. శాసనసభ్యులు శ్రీ డి. ఇ. ఆదినారాయణరెడ్డిగారు ఈ సభకు అధ్యక్షత వహించారు.

రాయలసీమ ప్రాంతీయశాఖ కార్యదర్శి శ్రీ ఎ. వెంకటేశంగారి తర్వాత శ్రీ ఇ. యల్. నరసింహంగారు మాట్లాడుతూ రాష్ట్రములో ఏర్పడిన విద్యుచ్ఛక్తి కొరతను, విద్యుచ్ఛక్తి శాఖ అధికారులు ప్లానులను అమలు జరుపుతున్నరీతిని, కార్మికుల ఇబ్బందులను వివరించారు.

అనంతపురం మున్సిపల్ కౌన్సిలరు శ్రీ బి. గోపాలకృష్ణగారు కార్మికుల కోర్కెలను బలపరుస్తూ ప్రసంగించారు. కార్మిక సమస్యలపై సభలో శ్రీ ఇ. ఆర్. వీరన్నగారు తీర్మానాలు ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించారు. మంజూరు అయిన గ్రామీణ విద్యుచ్ఛక్తి స్కీములను అమలు జరిపి రిట్రెంచిమెంటును నివారించాలని శాసన సభ్యులు శ్రీ డి. ఇ. ఆదినారాయణరెడ్డిగారు కోరారు. శ్రీ పి. ఇ. రామస్వామి వందన సమర్పణతో బహిరంగసభ ముగిసింది.

కర్నూలు సమావేశం

కర్నూలు పట్టణ విద్యుచ్ఛక్తి కార్మికుల సమావేశం శ్రీ ఓ. సుబ్బారావు గారి అధ్యక్షతను జూలై 30న జరిగింది. సమావేశానికి రాయలసీమ ప్రాంతీయశాఖ నాయకులు శ్రీ పి. యస్. నాగేశ్వరరావు, శ్రీ ఎ. వెంకటేశం, శ్రీ ఇ. ఆర్. వీరన్న గారలు హాజరయ్యారు.

కర్నూలు బ్రాంచికి ఈ క్రిందిసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు: శ్రీ ఎ. బసంతరావు, కార్యదర్శి: శ్రీ ఓ. సుబ్బారావు, కోశాధికారి: శ్రీ వి. నాగేశ్వరరావు, ఆరుమంది కార్యవర్గసభ్యులు.

విజయవాడలో జరిగిన 8వ మహాసభ తీర్మానాలను ఆమోదించారు.

అధికారులతో యూనియన్ కార్యకర్తల చర్చలు

ప్రాంతీయ శాఖ అధ్యక్షులు శ్రీ నాగేశ్వరరావు, కార్యదర్శి శ్రీ ఎ. వెంకటేశం, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీ ఇ. ఆర్. వీరన్న గార్లు కార్మిక సమస్యలపై కర్నూలు సర్కిల్ విద్యుచ్ఛక్తి సూపరింటెండెంట్ ఇంజనీరు (కన్స్ట్రక్షన్) శ్రీ తిమ్మయ్య, కన్స్ట్రక్షన్ ఎగ్జిక్యూటివ్ అసిస్టెంటు ఇంజనీర్ శ్రీ నరసింహులుగార్లతో కలిసి జూలై 31న చర్చించారు. టి. ఎ. బిల్లులు, టి.టి.ఎ బిల్లులు [illegible] బిల్లులను గురించి ఆపరేషన్, కన్స్ట్రక్షన్ చీఫ్ అకౌంటెంటుతోకూడా చర్చించారు.

కర్నూలు ఆపరేషన్ డివిజన్‌లో పనిచేస్తున్న విద్యుచ్ఛక్తి కార్మికుల కష్టాలను గురించి చర్చించడానికి ఆపరేషన్ డివిజనల్ ఇంజనీరు శ్రీ కోటయ్యగారు అనుమతి నివ్వక, [illegible]లో యూనియన్ కార్యకర్తలతో అమర్యాదగా ప్రవర్తించినందుకు నిరసనగా యూనియన్ కార్యకర్తలు సమావేశంనుండి బయటకు వచ్చేశారు.

ఈ విషయాన్ని అనంతపురం సర్కిల్ సూపరింటెండెంట్ (ఆపరేషన్)కు, కర్నూలు జిల్లా కలెక్టరు ఆఫీసుకు తెలియజేశారు. (వి. వి.)

నెల్లూరులో బహిరంగ సభ

లంగరు చుట్టల కార్మికుల కోర్కెలను బలపరస్తూ ప్రసంగాలు

నెల్లూరు, ఆగస్టు 12

నెల్లూరులో లంగరు చుట్టల కార్మికుల కోర్కెలను బలపరస్తూ నిన్న రాత్రి రంగనాయకులపేటలో బహిరంగ సభ జరిగింది.

డా. పి. వి. రామచంద్రారెడ్డిగారు ప్రసంగిస్తూ సమ్మెలో పాల్గొంటున్న కార్మికులకు ఉదారంగా విరాళాలివ్వవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కార్మికులు ఒక నెలరోజులుగా సమ్మె చేస్తున్నారు.

లంగరు చుట్టల పరిశ్రమ యజమానికి రోజుకొకటికి సుమారు రు 500ల లాభాలు వస్తున్నా కార్మికుల కనీస కోర్కెలను తీర్చడానికి ఆయన అంగీకరించడం విచారకరమని పట్టణ కార్మిక సంఘ కార్యదర్శి శ్రీ వి. రామకోటయ్యగారు విమర్శించారు.

కార్మికుల న్యాయమైన కోర్కెలను గుర్తించి, వారి పోరాటానికి సానుభూతి తెలుపుతూ చుట్టు ప్రక్కల గ్రామాలయిన కొత్తూరు, దామరమడుగు మున్నగు చోట్లనుండి ప్రజలు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారని అన్నారు.

పట్టణంలోని వివిధ పరిశ్రమలకు చెందిన కార్మికులు తమ సానుభూతిని వెల్లడించుకున్నారు.

సమ్మె ఇంకా సాగుతున్నది. నేటికి 30 వ రోజు నడుస్తున్నది. (వి. వి)

లండన్‌లోని బ్రిటిషు ఫాసిస్టు సంస్థ కేంద్ర కార్యాలయాన్ని పోలీసులు సోదా చేశారు.

"ఆధార విద్యా సూత్రాలు ప్రధానంగా మంచివే"

ఆధార విద్యాబోర్డు భావం

న్యూఢిల్లీ, ఆగస్టు 11

ఆధార విద్య మూల సూత్రాలు ప్రధానంగా చాలా మంచివని ఆధార విద్యా జాతీయ బోర్డు అభిప్రాయ పడింది.

రెండు రోజులుగా సమావేశమవుతున్న యీ బోర్డు, ఆదిలో మహాత్మా గాంధీచే ప్రచారం చేయబడిన యీ విద్యా విధానం దేశంలో ప్రాథమిక విద్యనందించడానికి అత్యుత్తమమైన పద్ధతి అని చెప్పింది.

ఈ జాతీయ కర్తవ్యాన్ని నిర్వహించడం కోసం ఆధార విద్య పని చేసే తీరును, అమలుజరిపే తీరును సవివరంగా పునరాలోచించి, కొన్ని సర్దుబాట్లు చేసుకోవాలని నిర్ణయించింది.

ఈ బోర్డు సమావేశానికి కేంద్ర విద్యాశాఖమంత్రి డా॥ కె. ఎల్. శ్రీమాలి అధ్యక్షత వహించారు.

గంగవరం గ్రామస్తులచే పాఠశాల నిర్మాణం

మంప, ఆగస్టు 8

విశాఖజిల్లా, చింతపల్లి తాలూకా మంప పంచాయతీలో చేరిన 'గంగవరం' లో గ్రామస్తులు స్వయంగా పాఠశాలను నిర్మించుకొన్నారు. సుమారు 30 మంది విద్యార్థులు, చదువుకొనుటకు వీలుగా దానిని నిర్మించబడింది. ఉపాధ్యాయునికి గృహవసతి కూడా యేర్పాటు చేయబడింది.

మి[illegible] దాలివద్ద దక్షిణ ఇండో చైనా [illegible] బలాలు పరస్పరం కాల్పులు జరిపినట్లు హాంగ్ వార్త.

రాజస్థాన్‌లో మిడతలప్రమాదం

మంత్రి శ్రీ మర్ధా ప్రకటన

జయపూర్, ఆగస్టు 11

రాజస్థాన్‌లో గత 80 సంవత్సరాలలో ఎన్నడూ లేనంత గొప్ప ఎత్తున మిడతల ప్రమాదం ఈ సంవత్సరం ఏర్పడింది. ఇందువలన మూడు వేలకు మించిన గ్రామాలలో తీవ్రమయిన నష్టాలు యింతవరకు జరిగాయి.

దేశానికి వచ్చిన దాదాపు 1284 మిడుతల దండులలో రాజస్థాన్‌కు 100 దండుల వరకువచ్చిపడి పంటలను నిర్మూలనం గావించాయని రాష్ట్ర మంత్రి శ్రీ మధూరాం మర్ధా అన్నారు.

మరోసారి మిడతలదాడి జరిగే ప్రమాదం త్వరలో కేవున్నదని మంత్రి అన్నారు. వర్షాకాలంలో మరో దండు వస్తుందని అనుకుంటున్నామని ఆయన అన్నారు.

ఆయన పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ ఈమిడతల ప్రమాదాన్ని జాతీయ ప్రమాదంగా భావించి మొత్తం దేశమంతా ఈ ప్రమాదాన్ని నివారించేందుకు సంసిద్ధం కావాలని అర్థించారు.

ఎడారి ప్రాంతాలలో మిడతలు చాల విస్తృతంగా గుడ్లు పెట్టాయని ఆయన వెల్లడించారు.

అదేవిధంగా సాగు ప్రాంతాలలో కూడా ఈ పురుగుల ప్రమాదం తీవ్రంగావున్నది. జయపూర్, టోంక్, అజ్మీర్, పాలి, ఆల్వార్, భరత్‌పూర్, నాగపూర్‌లు ఈ మిడతలదాడికి తీవ్రంగా గురవుతున్నాయి.

ఎడారి ప్రాంతంలోగల 2,370 గ్రామాలలో మిడతలు గుడ్లు పెట్టాయని మంత్రి శ్రీ మర్ధా అన్నారు.

పాకిస్తాన్ రాజకీయపక్షానికి అమెరికా లంచం

కమ్యూనిజానికి వ్యతిరేకంగా పోరాడాలని షరతు

రావల్పిండి, ఆగస్టు 12

లాహోర్‌లో ఇద్దరు అమెరికా దౌత్యప్రతినిధులు తన పార్టీకి రు 50 వేల లంచం ఇవ్వజూపారని ఆల్ జమ్హూర్ పార్టీ ప్రధాన కార్యదర్శి జాహిద్ మల్లిక్ నేడు వెల్లడించారు. తమ పార్టీని కమ్యూనిజానికి వ్యతిరేకమైన వేదికగా ఉపయోగించాలని అమెరికా దౌత్య ప్రతినిధులు షరతు పెట్టారని ఆయన చెప్పారు.

మల్లిక్ ఈ విషయాలను లాహోర్‌లో ఒక పత్రికా గోష్ఠిలో బయట పెట్టారు. ఈ ఇద్దరు అమెరికా ఉద్యోగులను అవాంఛనీయ వ్యక్తులుగా ప్రకటించి దేశంనుంచి వెళ్ళగొట్టాలని ఆయన డిమాండు చేశారు. ఈ ఉద్యోగుల విచ్ఛిన్నకర చర్యలపైన అమెరికా ప్రభుత్వానికి పాకిస్తాన్ ప్రభుత్వం నిరసన తెలపాలని కూడా మల్లిక్ కోరారు. ఆల్ జమ్హూర్ పార్టీ ఇటీవలనే ఏర్పడింది.

7 నెలల జీతం రాని ధవళేశ్వరం టీచర్లు

ధవళేశ్వరం, ఆగస్టు 9

తూర్పు గోదావరిజిల్లా ధవళేశ్వరం లూథరన్ మిడిల్ స్కూలు టీచర్లకు 7 నెలలనుండి జీతములు రానందున చాలా ఇబ్బందులు పడుతున్నారు.

కాకినాడ అసెంబ్లీ ఎన్నికల వివాదం

కొత్త ట్రిబ్యునల్ నియామకం

కాకినాడ, ఆగస్టు 10

కాకినాడ అసెంబ్లీనియోజకవర్గంలో శ్రీ దంటు భాస్కరరావు ఎన్నిక చెల్లదని శ్రీ సి. వి. కె. రావు పెట్టుకొన్న ఎన్నికల దరఖాస్తును విచారించడానికి పశ్చిమ గోదావరి జిల్లా జడ్జి శ్రీ కందికొండ వెంకట్రావును ఎన్నికల ట్రిబ్యునల్ గా నియమించినట్లు ఎన్నికల కమిషన్ వారు ప్రతివాదులకు తెలియపరిచింది.

ఈ దరఖాస్తును విచారించడానికి మొదట తూర్పు గోదావరి జిల్లాజడ్జి శ్రీ బి. యస్. రామమోహనరావు నియమింపబడ్డారు. శ్రీ సి. వి. కె. రావు తనకు సుపరిచితుడైనందున దరఖాస్తును మరో ట్రిబ్యునల్ కు అప్పగించడం భద్రంగా ఉంటుందని శ్రీ రామమోహనరావు ఎన్నికల కమిషన్‌కు తెలియజేశారు. ఫలితంగా కొత్త ట్రిబ్యునల్ ను ఇప్పుడు నియమించారు.

వీధి దీపాలు లేక ఐతానగరంలో ప్రజల ఇక్కట్లు

తెనాలి, ఆగస్టు 10

తెనాలి మున్సిపాలిటీకి చెందిన ఐతానగరంలోని పద్దిసన్ పేటలో గత మూడు మాసాలనుంచి వీధి దీపాలు వెలగడంలేదు. ఈ పేటలోని రోడ్లు కూడ సంవత్సరాల తరబడి రిపేరీలు లేక దుస్థితిలో ఉన్నాయి. ఫలితంగా ప్రజలు చాల ఇబ్బంది పడుతున్నారు.

మున్సిపల్ కమిషనరుకు, తెనాలి క్యాంపు వచ్చిన లోకల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టరుకు విజ్ఞప్తులు అందజేసినప్పటికీ ఇంతవరకు ఎట్టిచర్య తీసుకోలేదు. ప్రభుత్వం ఎలక్ట్రిక్ బల్బులను సరఫరా చేయడంలేదని, అందులో తాము చేయగలిగింది ఏమీలేదని మున్సిపల్ అధికారులు అంటున్నారు. పద్దిసన్ పేటలో వెంటనే విద్యుద్దీపాలు వెలిగించేట్లు చూడాలని కోరుతూ జిల్లా కలెక్టరుకు 50 మంది పౌరులు ఒక మెమోరాండం పంపారు.

"విముక్తి సైన్యాన్ని పౌరసైన్యంగా మార్చాలి"

అల్జీరియా నాయకుడు ఖిదర్ ప్రకటన

అల్జీర్స్, ఆగస్టు 11

అల్జీరియాలో పౌర, సైనిక అధికారాలను స్పష్టంగా విభజించి, అల్జీరియా విముక్తి సైన్యాన్ని విజయవంతమైన ప్రజాసైన్యంగా మార్చివేయాలని అల్జీరియా రాజకీయ బ్యూరో సభ్యుడు మహమ్మద్ ఖిదర్ ప్రకటించారు.

విముక్తి సైన్యం, పోలీసులను, వ్యాపార సంస్థల భవనాలను, ఇతర ప్రజోపయోగకరమైన భవనాలను ఖాళీ చేయవలసినదిగా రాజకీయ బ్యూరో ఉత్తర్వు జారీచేసిందనికూడ ఖిదర్ వెల్లడించారు.

ఖిదర్ ఇంకా ఇలా అన్నారు. సోదాలు చేయడం, పన్నులు విధించడం, విముక్తి సేన ఉపయోగానికిగాని, జాతీయ విముక్తి సంఘటన ఉపయోగానికిగాని ఆస్తులు ఆక్రమించడం రాజకీయ బ్యూరో నిషేధించినదనీ, అల్జీరియా విముక్తి సైన్యం ఆమోదంతో ఇది జరిగిందనీ ఖిదర్ అన్నారు.

కోసీనదిలో తీరని వరదలు

పాట్నా, ఆగస్టు 11

కోసీనదిలో వరద నిన్న కొద్దిగా తగ్గినట్లు కనిపించినా నేడు తిరిగి హెచ్చిపోయింది.

నిన్న 1,87,000 క్యూసెక్కుల నీటి ప్రవాహంగల నది నేటి మధ్యాహ్నంవరకు 2,48000 క్యూసెక్కుల వరకు పెరిగిపోయింది.

ఉత్తర బీహార్‌లోని ఇతర నదులైన భగ్మతి, బుర్హిగండక్, గండక్, కమలా బలాన్ నదుల నీటిమట్టం పెరిగి పోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. కాని చంపారన్, ముజఫర్‌పుర్, దర్భంగా, సహర్సా, ముంగేర్ జిల్లాలలో కొన్ని ప్రాంతాలు నీటిలో మునిగిపోయే వున్నాయి.

ముజఫర్ నుండి అందుతున్న ఒక వార్త ప్రకారం బర్హీగండక్ నది 50 చదరపు మైళ్ళ ప్రాంతాన్ని వరదలో ముంచి వేసింది. వరద చేల యందు వేల యకరాల మొక్కజొన్న పంట వరదదెబ్బతిని నాశనమయి పోయేటట్లున్నది.

ఐరాసకు కాశ్మీర్ సమస్య నివేదించే ప్రసక్తి

తాను అనలేదని పాక్ విదేశాంగ మంత్రి

కరాచీ, ఆగస్టు 11

కాశ్మీర్ తగాదాను ఐరాస సర్వసభ్య సమావేశానికి నివేదించాలని పాకిస్తాన్ ప్రభుత్వం నిర్ణయించుకొన్నదని, ఎప్పుడు నివేదించాలన్న అంశము మిగిలి ఉన్నదని తాను చెప్పినట్లు వచ్చిన వార్తల్లో నిజంలేదని పాక్ విదేశాంగమంత్రి మహమ్మదలీ నేడు అన్నారు.

తగాదాను ఐరాస సర్వసభ్య సమావేశానికి నివేదించాలని పాక్ ప్రభుత్వం ఆలోచిస్తున్నదని మాత్రమే తాను లాహోర్‌లో చెప్పానని ఆయన అన్నారు.

తగాదా పరిష్కారానికి కొత్తగా మధ్యవర్తి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని కూడ తాను చెప్పలేదన్నారు.

మధ్యవర్తిత్వంద్వారా సైతం ఈ సమస్య పరిష్కారం గావడానికి పాకిస్తాన్ అనుకూలమే అని మాత్రం తాను అన్నానని మహమ్మదలీ తెలియ పరచారు.

కామన్వెల్త్ దేశాల ప్రధాన మంత్రుల మహాసభ జరిగే సందర్భంలో లండన్‌లో ప్రధాని నెహ్రూతో పాక్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ విడిగా కలుసుకొని మాట్లాడతారా, అన్న ప్రశ్నకు సమాధానంగా "ఆ విషయం నాకు తెలియదు" అని మహమ్మదలీ జవాబిచ్చారు.

కేంద్రీకృత ప్రభుత్వం భారతదేశానికి అవసరమని కేరళ గవర్నరు శ్రీ గిరి బెంగుళూరులో అన్నారు.

* * *

బెంగాల్‌లోని ఫోటోఫిలిం కర్మాగారం ఆగస్టు 8న ఉత్పత్తి ప్రారంభించింది.

కేరళ ప్రయివేటు స్కూళ్ళ మేనేజర్ల మహాసభ

అలెప్పీ, ఆగస్టు 12

అలెప్పీ జిల్లా ప్రయివేటు విద్యాలయాల మేనేజర్ల సమావేశం ఇక్కడకు 30 మైళ్ళదూరంలోవున్న ముత్తుకులంలో గత రాత్రి జరిగింది. ప్రస్తుత ప్రభుత్వ వర్గాలలో ప్రబలుతున్న కొన్ని ధోరణులపట్ల వారు తమ ఆందోళనను వ్యక్త పరిచారు. ముఖ్యంగా ప్రయివేటు విద్యాలయాలపై నిషేధాల నిబంధన చేయడం పట్ల వారు ఆందోళన చెందారు.

జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 70 మంది ప్రయివేటు విద్యాలయాల మేనేజర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు.

వారొక తీర్మానంచేస్తూ ఇప్పటికే అనేక చిక్కులకు లోనవుతూ, దిన దినం ఎక్కువవుతున్న విద్యార్థులకు విద్యా సౌకర్యాలు కలిగించే బాధ్యత నిర్వహిస్తున్న ఈ పాఠశాలల మేనేజర్లకు ఇంకా ఎక్కువ చిక్కులు కలిగించవద్దని అర్థించారు.

క్రొత్తస్కూలులు ప్రారంభించేందుకు, కావలసిన క్రొత్త భవనాల నిర్మాణానికి [illegible] సంవత్సర వ్యవధి [illegible] అన్నారు.

మేనేజర్ల కోర్కెలను ప్రభుత్వానికి వివరించే నిమిత్తం ఏడుగురుసభ్యులతో కూడిన ఒక కార్యాచరణసంఘాన్ని ఎన్నుకున్నారు.

సాపగడ్డకు అడ్డకట్ట నిర్మాణం

కృష్ణదేవిపేట, ఆగస్టు 8

విశాఖ జిల్లా చింతపల్లి తాలూకా రింతాడ పంచాయతీ అధ్యక్షులు శ్రీ లగ్గి వీరయ్యదొరగారు ఇలా ప్రకటిస్తున్నారు:

విశాఖజిల్లా చింతపల్లి సమితిలో చేరిన పంచాయతీలలో రింతాడ పంచాయతీ ఒకటి. ఈ పంచాయతీ ఏరియా నుండి రింతాడ గ్రామానికి పశ్చిమ దిశగా సుమారు 200 ఎకరాల సమ తల్లమైన భూమి వున్నది. ఈ భూమి సాగుకు అవసరమైనంత నీరు యివ్వగల "సాపగడ్డ" అనే పేరుగల కొండవాగు యిక్కడ వున్నది.

గిరిజనప్రజల వ్యవసాయ సంబంధాలలో ముఠాదారు పాలన రద్దుచేయబడినందున, గ్రామాలనుగూర్చి- వాటి అభివృద్ధినిగూర్చి గిరిజన ప్రజలు చేసిన [illegible] వుండేది. పంచాయతీల నిర్మాణం ప్రారంభం కావడంతో మున్ముందుగా ఈ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసుకొనే అవకాశం కలిగింది. కాబట్టి "సాపగడ్డ"కు అడ్డకట్ట నిర్మాణము గావించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుచున్నాము.

తాడేపల్లిగూడెం హోటల్ వర్కర్ల యూనియన్

తాడేపల్లిగూడెం, ఆగస్టు 8

తాడేపల్లిగూడెం పట్టణ హోటల్ పనివారు శ్రీ యస్. రాజాగారి అధ్యక్షతను నిన్న ఇక్కడ సమావేశమై తమ యూనియన్‌ను ఏర్పాటు చేసుకొన్నారు. యూనియన్ ఆవశ్యకతను గురించి శ్రీ జి. వి. నరసింహారావుగారు మాట్లాడారు. శ్రీ యస్. రాజా గారు అధ్యక్షులుగాను, శ్రీ ఎస్. రాధాకృష్ణ కార్యదర్శిగాను, శ్రీ యం. గంగాధరం, నంగ రాజు, అప్పారావు, బొజ్జి, వెంకటేశ్వరరావు పంగులు, కరుణాకర్, బూరిడి వెంకటేశ్వర్లు, మూర్తిగార్లను సభ్యులుగా ఎన్నుకొన్నారు.

ట్రేడ్ యూనియన్ చట్టప్రకారం యూనియన్‌ను రిజిస్టరు చేయించాలని కూడా తీర్మానించారు.

అదనపు భూమిశిస్తు చట్టానికి శ్రీకాకుళంలో ప్రతిఘటన

అఖిలపక్ష కార్యాచరణ కమిటీ ఏర్పాటు

శ్రీకాకుళం, ఆగస్టు 11

అదనపు భూమిశిస్తు బిల్లుకు వ్యతిరేకంగా ఈనెల 10న ఇక్కడ శ్రీకాకుళంజిల్లా అఖిలపక్ష సదస్సు జరిగింది. ఈ సదస్సుకు జిల్లాలో 11 తాలూకాలలో 200 గ్రామాలనుంచి 600 మంది ప్రతినిధులు హాజరయ్యారు. శ్రీ కప్పగంతుల సుబ్బారావుగారు అధ్యక్షత వహించిన ఈ సదస్సులో ప్రజాపార్టీ నాయకులు శ్రీ తెన్నేటి విశ్వనాథం (యం. యల్. ఏ), అఖిలభారత కిసాన్ సభ కార్యదర్శి శ్రీ కందూరి ప్రసాదరావు, జిల్లా స్వతంత్రపార్టీ కార్యదర్శి శ్రీ చాదరి సత్యనారాయణ, ప్రముఖ అడ్వొకేట్ శ్రీ పుల్లెల సీతారామయ్య, మందసా పంచాయతీసమితి అధ్యక్షులు శ్రీ మజ్జి తులసీదాస్, శ్రీ పిమ్మ జగన్నాథం (స్వతంత్రపార్టీ యం. యల్. ఏ) శ్రీ దాట్ల గోవింద రాజులు (కమ్యూనిస్టు యం.యల్.సి), జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ రామలింగాచార్య, శ్రీ గేదెల అప్పల నారాయణ, శ్రీ గుప్త రమణమూర్తి, తదితరులు ప్రసంగించారు.

తర్వాత శ్రీ కప్పగంతుల సుబ్బారావుగారు అధ్యక్షులుగా శ్రీయుతులు పంతులు జగన్నాథం, మజ్జి తులసీదాస్, [illegible] సత్యనారాయణ (ఉపాధ్యక్షులు), శ్రీ రామలింగాచారి (కార్యదర్శి), మాజీశాసనసభ్యులు శ్రీ పసగాడ సూర్యనారాయణ, శ్రీ యజ్ఞేశ్వర శాస్త్రి కాంగ్రెస్ నాయకులు శ్రీ పుల్లెల సీతారామయ్య, శ్రీ గోవింద రాజులు (యం. యల్. సి.) తదితరులు సభ్యులుగా జిల్లా కార్యాచరణ కమిటీని ఎన్నుకొన్నారు.

సదస్సులో అదనపు భూమిశిస్తు బిల్లును ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. ప్రభుత్వం ఈ బిల్లును ఉపసంహరించుకోనట్లయితే ప్రజానీకం ఈ బిల్లును ప్రతిఘటించి త్రిప్పి కొట్టవలసి యుంటుందని ప్రజానీకానికి హెచ్చరిక చేశారు.

ఆదిలాబాద్ జిల్లాలో పనాస పంటలకు దెబ్బ

వర్షాలు లేకపోవడంమూలంగా

బెల్లంపల్లి, ఆగస్టు 11

తూర్పు ఆదిలాబాద్ జిల్లా రైతు సంఘ కార్యదర్శి శ్రీ పి. నరసయ్యగారు వర్షాభావంవల్ల జిల్లాలో ఏర్పడిన పరిస్థితిపై క్రింది ప్రకటన చేశారు:

ఆదిలాబాద్ జిల్లాలో యీ ఏడు వర్షాలు కురియక పునాస పంటలు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం యేర్పడింది. రబ్బీకి కొన్నిపోతలు జరుగుతాయో లేదో అని రైతాంగం ఆందోళన పడుతున్నది.

ప్రభుత్వం జిల్లాలో కరువు నివారణకు క్రింది తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

1. కుంటలు, చెరువులు, రోడ్ల రిపేరి పనులు వెంటనే ఏర్పాటు చేయించాలి.
2. చౌకడిపోలను ఎక్కువగా పెట్టాలి.
3. వ్యవసాయానికి అవసరమైన పనిముట్లు ఎరువులు సరైన ధరలకు దొరికేటట్లు చూడాలి.
4. రైతులకు తక్కావి అప్పులు హెచ్చుగా యిప్పించి తగిన సహాయం చేయాలి.

విజయవాడ-ఆకిరిపల్లి - నూజివీడు బస్సులు

రోడ్డు గండిమూలకంగా తాత్కాలికంగా నిలుపుదల

విజయవాడ, ఆగస్టు 11

నాలుగు రోజులుగా విపరీతమైన వర్షాలు కురవటంవలన విజయవాడ - ఆకిరిపల్లి రోడ్డుమీద బస్సు ప్రయాణానికి అవరోధంఏర్పడి నిన్నటినుండి ఆకిరిపల్లి మీదుగాపోయే విజయవాడ-నూజివీడు బస్సులను తాత్కాలికంగా రద్దుచేశారు.

తిరిగి ఎప్పుడు ప్రారంభమయ్యేది ఆర్. టి. సి. అధికారులు చెప్పలేకుంటున్నారు.

విజయవాడ-ఆకిరిపల్లి మధ్య ఉన్న [illegible], కుంపిణీ వాగులు పొంగి రోడ్డు మునిగి పోవటం వలన బస్సులు నడవటానికి అవరోధం ఏర్పడింది. వర్షాలు తగ్గిపోతేగాని తిరిగి బస్సులు ప్రయాణం చేయటానికి వీలుపడదు.

విజయవాడనుండి హనుమాన్ జంక్షన్ మీదుగా నూజివీడు వెళ్ళే బస్సులు, నూజివీడునుండి ఆకిరిపల్లి వరకు వెళ్ళి తిరిగి నూజివీడు వెళ్ళేటట్లుగా ప్రస్తుతం ఏర్పాటుచేశారు. (వి. వి.)

కోయంబత్తూరులో టి.వి. మండగం కార్మికుల సభలో కేరళ గవర్నర్ శ్రీ గిరి ప్రసంగించారు.

కాకినాడ రైల్వే ఓవర్ బ్రిడ్జికై అభ్యర్థన

కాకినాడ, ఆగస్టు 8

కాకినాడ గల్లకొయి వీధిలోని లెవెల్ క్రాసింగువద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జినిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని రైల్వే మంత్రిత్వశాఖను కోరుతూ తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ పట్టణ ప్రయాణీకులసంఘ పాలకవర్గం తీర్మానించింది. పాలకవర్గ సమావేశం మునిసిపల్ ఛైర్మన్ శ్రీ సుంకర అప్పారావు అధ్యక్షతన ఆగస్టు 5న జరిగింది.

ఓవర్ బ్రిడ్జి కిరుపైపులా అవసరమైన రోడ్లను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కాకినాడ మీదుగా మెయిన్ లైనును మళ్ళించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ మరొక తీర్మానం చేశారు. ఇటీవలి కాలంలో రైల్వే ప్రమాదాలు అధికమవుతున్నందుకు విచారం వ్యక్తం చేశారు.

సమావేశంలో శ్రీయుతులు యస్. యస్. కృష్ణాజీ, కె. అప్పారావు, యం. వి. గిరుణ, వి. సుభద్రరావు, పి. వి. రామాచారి, వి. బలమయ్య, పి సుబ్బారాయుడు, తదితరులు మాట్లాడారు.

లోక్‌సభకు శ్రీబాసు ఎన్నిక

చెల్లనేరదని ఎన్నికల ట్రిబ్యునల్ తీర్పు

బర్ద్వాన్, ఆగస్టు 11

బర్ద్వాన్ నుండి లోక్‌సభకు ఎన్నికయిన కాంగ్రెసు అభ్యర్థి శ్రీ సుబోధ గోవిందబాసు ఎన్నిక చెల్లనేరదని, బంకురా జిల్లా జడ్జి శ్రీ ఎస్. కె. చక్రవర్తితో ఏర్పడ్డ ఎన్నికల ట్రిబ్యునల్ నేడు తీర్పు ఇచ్చింది.

క్రొత్త ఎన్నికలు జరిపించవలసిందిగా ట్రిబ్యునల్ వారు ఆదేశించారు.

బంకూరా నియోజకవర్గానికి చెందిన ఇద్దరు సాధారణ ఓటర్లు శ్రీ బాసు ఎన్నిక చెల్ల కూడదని సవాల్ చేస్తూ, ఎన్నికల కమిషన్‌కు దరఖాస్తు పెట్టుకున్నారు. శ్రీ బాసు ప్రభుత్వోద్యోగంలో వున్నాడని వారివాదన. ఆ బాసు లైఫ్ ఇన్సూరెన్సు కార్పొరేషన్‌కు హిందూస్థాన్ స్టీల్సుకు, దుర్గాపూర్ స్టీల్ ప్రాజెక్టుకు ఆడిటర్‌గావుండి ప్రభుత్వంలో లాభసాటి ఉద్యోగాలు నిర్వహించుచున్నాడు. అంతేగాక పశ్చిమబెంగాల్ ఫైనాన్సు కార్పొరేషన్ డైరెక్టరుగా కూడా ఆయన ఉద్యోగం చేశారు.

శ్రీ బాసు గత ఫిబ్రవరిలో జరిగిన సాధారణ ఎన్నికలలో బర్ద్వాన్ నియోజకవర్గంనుండి లోక్‌సభకు గెలుపొందారు. ఆయన తనతో పోటీ చేసిన ఫార్వర్డుబ్లాకు అభ్యర్థి శ్రీ సుబిమాన్ ఘోష్‌ను ముఖాముఖి పోటీలో 82,470 ఓట్ల తేడాతో ఓడించారు.

పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్, జీవితభీమా సౌకర్యాలకై ప్రత్యక్ష చర్య

అఖిలభారత సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ ఫెడరేషన్ నిర్ణయం

న్యూఢిల్లీ ఆగస్టు 11

అక్టోబరు 10 నాటికి సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులకు పెన్షన్, జీవితభీమా, ప్రావిడెంట్ ఫండుల ఏర్పాట్లు అమలు జరపబడకపోయినట్లయితే, ప్రత్యక్షచర్య జరపడానికి అఖిల భారత సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయ ఫెడరేషన్ ఈనాడు నిర్ణయించింది

ఇక్కడ జరిగిన ఫెడరేషన్ కార్యనిర్వాహక వర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకొన్నారు. ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీ యస్. ఫి. రాయ్ (పశ్చిమ బెంగాల్ యం. యల్. సి) సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశానికి పశ్చిమ బెంగాల్, బీహార్, అస్సాం, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్ రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాలు, ఇంకా ఢిల్లీ నుంచికూడా ప్రతినిధులు హాజరయ్యారు.

కేంద్ర ప్రభుత్వంనుంచి వచ్చిన ఒత్తిడిని సైతం ఖాతరు చేయకుండా, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయులకు త్రివిధ సౌకర్యాలు-పెన్షన్, జీవితభీమా, ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యాలు- కలిగించే విషయంలో ఉదాసీనత వహిస్తున్నందుకు ఈ సమావేశం తీవ్రంగా నిరసన తెలియజేస్తూ తీర్మానించింది.

ప్రత్యక్ష చర్య ఏ రూపంలో వుంటుందో అక్టోబర్ 13న కటక్‌లో జరిగే అఖిలభారత సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయ మహాసభలో ప్రకటింపబడుతుందని ఆ తీర్మానంలో తెలియచేశారు.

సమావేశంలో, దేశంలో వున్న సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులందరికీ ఒకే ఒక వేతనాలుస్కేలు, పని విధులు నిర్ణయించాలనీ, విశ్వవిద్యాలయ ఆర్థిక సహాయ సంస్థ (యు. జి. సి) లాగా సెకండరీ పాఠశాలలకు కూడా ఒక ఆర్థిక సహాయ సంస్థను నెలకొల్పాలని తీర్మానాలు చేశారు.

ఆర్థిక యిబ్బందుల్లో వున్న ఉపాధ్యాయులకు సహాయం చేయడానికిగాను, రాష్ట్రాలలో వున్న ఉపాధ్యాయ ఫెడరేషన్ శాఖలతో ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు సంప్రదించాలని మరో తీర్మానం కూడా చేశారు.

శ్రీ రాయ్ నాయకత్వాన ఒక ప్రతినిధి వర్గంవారు ఈనాడు కేంద్రవిద్యాశాఖమంత్రి డా॥ కె. ఎల్. శ్రీమాలిని కలుసుకొన్నారు. కేంద్ర విద్యావిషయక బోర్డు, సెకండరీ విద్యావిషయక స్థాయీ కమిటీలలో ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రతినిధులకు ప్రాతినిధ్యం యివ్వాలనివారు కేంద్ర విద్యామంత్రిని కోరారు. ప్రయివేటు ఎయిడెడ్ స్కూళ్ళ సమస్యలను కూడా వారు విద్యామంత్రితో చర్చించారు.

పిచ్చాస్పత్రుల అభివృద్ధికి కేంద్రం సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 11

రాష్ట్ర ప్రభుత్వం ప్రాంతీయ ప్రాతిపదికపై పిచ్చాస్పత్రులను అభివృద్ధి చేయాలనీ, ప్రతి ఆసుపత్రిలోను 750 వరకు పడకల సంఖ్య పెంచవచ్చునని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది.

మనోవ్యాధులనుగురించిఒకవిధమైన ఉపేక్ష దేశంలో వ్యాపించిందనీ, ఈ వ్యాధుల చికిత్సకు, వ్యాధుల నిరోధానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని లక్ష్మణస్వామిమొదలియార్ కమిటీ చేసిన సూచనలను కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తెచ్చింది.

మామూలు వైద్యులకు ఈ వ్యాధులను గురించి శిక్షణా తరగతులను నడపాలనికూడా కేంద్రం సూచించింది.

వైద్య న్యాయశాస్త్ర వేత్తలకు ఒక ప్రత్యేక కేడర్‌ను సృష్టించాలని మొదలియార్ కమిటీ చేసిన సూచనను ఆరోగ్య మంత్రిత్వశాఖ సూత్రప్రాయంగా అంగీకరించింది. వైద్య న్యాయ శాస్త్ర సంబంధమైన ముఖ్యమైన క్లిష్టమయిన కేసులను వీరికి అప్పజెప్తారు

గుంటూరు ఆస్పత్రిలో నర్సుల సమ్మె

డాక్టరు కొట్టినందుకు నిరసనగా

గుంటూరు, ఆగస్టు 11

గుంటూరు జనరల్ ఆసుపత్రిలో ఇటీవల ఒక నర్సును మరో డాక్టరు చెంపమీద కొట్టినందుకు నిరసనగా ఆసుపత్రిలోని నర్సులందరూ నిన్న ఉదయం 7 గంటలనుండి 8 గంటల వరకు సమ్మె చేశారు.

ఈ ఘటనపై విచారణ జరిపించి, ఆ డాక్టరుపై చర్య తీసుకోవాలని నర్సులు డిమాండ్ చేశారు. (వి. వి.)

రాజస్థాన్‌లో న్యాయకార్యనిర్వాహక శాఖల విభజన

జైపూర్, ఆగస్టు 11

వచ్చే సెప్టెంబరు నుంచిరాజస్థాన్‌లో పది జిల్లాలలో కార్యనిర్వాహక శాఖ నుంచి న్యాయశాఖ సంపూర్తిగా వేరు చేయబడుతుందని రాజస్థాన్ ప్రభుత్వ హోం, న్యాయశాఖలమంత్రి శ్రీ మథుర్ ఖాన్ మథుర్ ఈ నాడొక పత్రికా ప్రతినిధుల సమావేశంలో ప్రకటించారు.

'మనదేశంలో సోషలిజం శాసనసభలద్వారా రాదు'

ఆందోళన, పోరాటాలవల్లనే సాధ్యమని డాక్టర్ లోహియా వివరణ

అల్హాబాద్, ఆగస్టు 11

ఈ దేశంలో సోషలిజాన్ని శాసన సభలద్వారాగాక, ఆందోళన, పోరాటాలద్వారా మాత్రమే సాధించుకో గలుగుతామని నేడిక్కడ అల్హాబాద్ యూనివర్సిటీ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతూ సోషలిస్టుపార్టీ నాయకుడు డాక్టర్ రామమనోహర లోహియా అభిప్రాయం వెలిబుచ్చారు.

మనదేశంలో ధనికులకు పేదలకు మధ్యగల వ్యత్యాసం చాల ఎక్కువనీ, దీనిని తగ్గించడం శాసనసభలద్వారా సాధ్యపడదనీ ఆయనన్నారు.

పార్లమెంటు, శాసనసభా సభ్యునికి నెలకు వచ్చే జీతభత్యాలను, భూమిలేని వ్యవసాయ కార్మికునికి వచ్చే ఆదాయాన్ని ఆయన పోల్చారు. పార్లమెంటు సభ్యునికి నెలకు పదిహేనువందల రూపాయలు రాగా వ్యవసాయ కార్మికునికి పదిహేను రూపాయలు మాత్రమే వస్తున్నాయని ఆయన చెప్పారు.

ఆదాయాల్లో యింతటి వ్యత్యాసం ఇంగ్లండు, అమెరికాల్లో లేదని ఆయనన్నారు. అందువలన ఈ దేశంలో శాసనసభల ద్వారా సోషలిజాన్ని తేవడం అసాధ్యమని, ఆందోళన ద్వారా మాత్రమే సాధించుకోగలమని ఆయన వివరించారు.

గత పదిహేనేండ్లలోనూ మనదేశం కొంత అభివృద్ధిని సాధించినప్పటికీ అదే కాలంలో ఇతర దేశాలు సాధించుకొన్న దానితో పోల్చి చూస్తే అది చాలా స్వల్పమన్నారు.

"చిన్నగాక మొన్నే స్వతంత్ర రాజ్యంగా అవతరించిన ఘనా ఇండియాకంటే ఎక్కువ అభివృద్ధి చెందింది. నిజం చెప్పాలంటే, భారతదేశ ఆర్థిక విధానం విచ్ఛిన్నమవుతున్నది. ప్రజల ఆర్థిక పరిస్థితులు మరింత అధ్వాన్నమవుతున్నాయి." అని శ్రీ లోహియా అన్నారు.

మనదేశం అంత నెమ్మదిగా అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణం ఇండియా తన ఆదాయంలోని హెచ్చు భాగాన్ని విలాసవస్తువులకే ఉపయోగించుతున్నదేగాని ఉత్పత్తిని పెంచుకోడానికి బహుతక్కువగా వినియోగించడమేనన్నారు.

పశ్చిమ-ఇరియన్‌లో ఇండొనేషియా సైనికుల ప్రవేశం

హేగ్, ఆగస్టు 10

ఈ వారంలో పశ్చిమ ఇరియన్‌లో రెండుచోట్ల ఇండొనేషియా సైనికులు బోట్లలోవచ్చి దిగారని హాలెండియాలో నేడు జారీఅయిన అధికార ప్రకటనను బట్టి తెలుస్తున్నది.

డచ్చి సైన్యాలు అలా దిగిన ఇండొనీషియా సైనికులను ఎటూ కదలకుండా నిరోధించారట. గత రాత్రి మిసూల్ దీవిలో దిగిన ఇండొనీషియా సైనికులతో డచ్చి సైనికులు తలపడినట్లు డచ్చి సైనిక ప్రకటన తెలియజేస్తోంది. ఇక్కడ ఎంత మంది దిగింది తెలియదట

మంగళవారం రాత్రి ఓనిన్ ద్వీపకల్పానికి పశ్చిమంగావున్న ఒక దీవిలో 40 మంది ఇండొనీషియా సైనికులు దిగారని ఆ ప్రకటన తెలియజేసింది.

అర్జంటైనాలో అస్థిర పరిస్థితి

బ్యూనోఎయిర్స్, ఆగస్టు 11

నిన్న తెల్లవారే సరికి, అర్జంటైనా యుద్ధశాఖమంత్రి జనరల్ ఎడ్వర్డో సెనోరాన్స్, పదకొండు గంటలయినా గడవకుండానే తన ఉద్యోగం రాజీనామా ఇచ్చారు

ఇంతకు ముందున్న యుద్ధశాఖ మంత్రి జువాన్ బాటిస్టాలోజాకి వ్యతిరేకంగా కొంత మంది సైనికాధికారులు తిరుగుబాటు ప్రకటించడంతో ఆయన బుధవారం నాడు రాజీనామా చేశారు.

జనరల్ ఎడ్వర్డో సెనోరాన్స్, మునుపటి అర్జంటైనా అధ్యక్షుడయిన పెరాన్‌కి బద్ధ వ్యతిరేకి. పెరాన్ హయాంలో పరదేశవాసిగా ఉంటూ జనరల్ సెనోరాన్స్ పెరాన్ ప్రభుత్వంపై సైనిక తిరుగుబాటు నడిపాడు.

జువాన్ బాటిస్టాలోజా పక్షపాతి అయిన సైనికాధికారులు తిరుగుబాటు చేస్తామని బెదిరించారు. అందుచేత [illegible] జనరల్ సెనోరాన్స్ యుద్ధమంత్రిగా రావడంతో, సమస్య పరిష్కారమయి పోయిందనుకున్నారు.

కాని, లోజాపై తిరుగుబాటు జరిపిన జనరల్ ఫెడెరికో టోర్నకో మాంటెరో, ఇతని నియామకం కూడా నచ్చలేదు. లోజా స్థానంలో అతను తనను తానే యుద్ధ మంత్రిగా ప్రకటించుకున్నాడు. అందుచేత, ఈయా [illegible] పనికిరాదంటూ జనరల్ మాంటెరో తన సేనల్ని రాజధానిబ్యూనోఎయిర్స్ పైకి నడుపసాగాడు.

ఇతనిని ప్రతిఘటించడానికి, జనరల్ సెనోరాన్స్ పక్షపు సైనికాధికారులకు చెందిన టాంకుల దళం ఒకటి అర్ధరాత్రి రాజధానిలోకి వచ్చింది. ఈ విధంగా రాజధానిలోనే అంతర్యుద్ధ పరిస్థితి ఏర్పడింది.

ఈ పరిస్థితిలో జనరల్ సెనోరాన్స్ రాజీనామా ఇచ్చేశాడు. సైనికదళాల విరమణకై అర్జంటైనా అధ్యక్షుడు ఉభయపక్షాలవారికి విజ్ఞప్తి చేశాడు. ప్రస్తుత విషమపరిస్థితికి కారకుడయిన జనరల్ ఫెడెరికో టోర్నకో మాంటెరోని అధ్యక్ష కార్యాలయంలో వెంటనే హాజరు కావలసిందిగాకూడా ఈయన ఆజ్ఞాపించాడు.

కార్యవర్గసమావేశం

(1వ పేజీ తరువాయి)

మాన్ని గురించికూడా జాతీయ సమితి చర్చించగలదని ఆయన తెలియజేశారు.

ఇంతకుముందున్న ఎజెండాలో సోవియట్ కమ్యూనిస్టుపార్టీ 22వ మహాసభ తీర్మానాలు, పార్టీ నిర్మాణ సమస్యలు, ఎన్నికల సమీక్ష మాత్రమే వున్నాయి.

భారత - చైనా ప్రభుత్వాలమధ్య తాజాగా జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల దృష్ట్యా సరిహద్దు సమస్యపై కూడా సమావేశంలో చర్చకు రావచ్చునని శ్రీ నంబూద్రిపాద్ చెప్పారు.

మాస్కోలో యిటీవల జరిగిన శాంతి నిరాయుధీకరణ మహాసభల తీర్మానాల దృష్ట్యా ఆ సమస్యలను గురించి కూడా తాము చర్చించవచ్చునన్నారు.

పన్నుల వ్యతిరేక ఉద్యమం

దేశమంతటా కొనసాగించడానికి వీలుగా "పన్నుల వ్యతిరేక ఆందోళనా కార్యక్రమాన్ని" ప్రస్తుత మిక్కడ సమావేశమవుతున్న భారత కమ్యూనిస్టుపార్టీ జాతీయ సమితి రూపొందించవచ్చునని పి. టి. ఐ. విలేకరి తెలుపుతున్నాడు.

పి టి ఐ విలేకరి యింకా యిలా తెలుపుతున్నాడు:

కొత్తగా పన్నులను ప్రవేశపెట్టిన రాష్ట్రాల్లోనూ, పన్నులను ప్రతిపాదించనున్న రాష్ట్రాల్లోనూ సాగించవలసిన పన్నుల వ్యతిరేక ఆందోళన గురించి పార్టీ జాతీయ సమితి సమావేశంలో దగ్గరకు రావచ్చునని నంబూద్రిపాద్ నేడిక్కడ పత్రికల వారితో మాట్లాడుతూ అన్నారు.

జాతీయ సమితి సమావేశంలో చర్చకు రాదగిన సమస్యలపైముసాయిదా తీర్మానాలను ప్రస్తుత మిక్కడ సమావేశమవుతున్న జాతీయ కార్యవర్గం తయారు చేస్తుందని శ్రీనంబూద్రిపాద్ చెప్పారు.

భారత - చైనా సరిహద్దు సమస్యపై తన జనరల్ దృక్పథాన్ని పార్టీ యింతకుముందే రూపొందించినప్పటికీ మారిన పరిణామాల దృష్ట్యా ఈ సమస్యను తిరిగి పార్టీ జాతీయ సమితి సమీక్ష చేయవచ్చునని ఆయన తెలిపారు.

సోవియట్ కమ్యూనిస్టుపార్టీ తన 22వ మహాసభలో సిద్ధాంత సమస్యలపై వచ్చిన నిర్ణయాలను భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి సమీక్ష చేసి, మన దేశంలోని కమ్యూనిస్టు ఉద్యమానికి అది యివ్వగలిగిన పాఠాలనుగురించి ఒక అభిప్రాయానికి రాగలదని కూడా శ్రీ నంబూద్రిపాద్ చెప్పారు.

ఈ సమస్యపై గత జూన్ నెల ఆఖరులో ఢిల్లీలో పార్టీ జాతీయ కార్యవర్గం సమావేశమైనప్పుడు ఒక ముసాయిదా తీర్మానాన్ని తయారుచేసిందనీ, దాని నిప్పుడు జాతీయసమితి ఆమోదం కోసం ప్రవేశపెట్టవలెనని అన్నారు.

పార్టీముందున్న వివిధ సమస్యలను గురించి చర్చించి జాతీయ కార్యవర్గం ముసాయిదా తీర్మానాలను తయారుచేసి జాతీయ సమితిముందు ప్రవేశపెడుతుందనీ, వాటిల్లో దేనిని తీసుకొనిపరిశీలించాలో నిర్ణయించవలసింది జాతీయ సమితేనని శ్రీ నంబూద్రిపాద్ అన్నారు.

పార్టీ జాతీయసమితి సమావేశం ఆగస్టు 14వ తేదీన ప్రారంభమవుతుంది. అగస్టు 20వ తేదీవరకూ సమావేశం జరగాలని యింతకుముందు నిర్ణయించబడింది.

ప్రస్తుత మిక్కడ సమావేశమవుతున్న పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో 31 మంది సభ్యులలోనూ 28 గురు, ప్రత్యేకంగా ఆహ్వానించబడినవారు మరో ఇద్దరు పాల్గొంటున్నారు.

సమావేశంలో పాల్గొంటున్న వారిలో పార్టీ ఛైర్మన్ శ్రీ యస్. ఎ. డాంగే, పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనంబూద్రిపాద్, శ్రీ బి.టి. రణదివె, శ్రీసుందరయ్య, శ్రీ యస్. వి. ఘాటే, భూపేష్‌గుప్త మొదలుగాగల వారున్నారు.

రోదసీ యాత్రికుడు

(1వ పేజీ తరువాయి)

యంత్రం అమర్చబడింది. అది 19.995 మెగా సైకిల్స్‌పై వార్తా ప్రసారం చేస్తోంది.

అంతరిక్ష యాత్రికుడున్న స్థావరానికి- అంటే, భూమినుంచి నౌకకు నౌక నుంచి భూమి మీదికి- రేడియో సంబంధాలు కూడా అమర్చబడ్డాయి.

సోవియట్ రష్యా రోదసీలోనికి పంపిన అంతరిక్షనౌక వోస్టక్-3, భూమిని చుట్టిరావడానికి పట్టేకాలం, భూప్రదక్షిణ చేస్తున్న స్థావరం దినిఆకృతి, అంతా [illegible] మేజర్ టిటోవ్ భూప్రదక్షిణం చేసిన రోదసీ నౌక లాగ వున్నది

ఈ నౌక భూమిని 88½ నిమిషాల కాలంలో ఒకసారి చుట్టి వస్తున్నది.

భూ ప్రదక్షిణలో అంతరిక్షంలో తన మొదటిభాగం పరిశోధన కార్యక్రమం ముగిసిన తర్వాత, మేజర్ నికొలయేవ్ ఆహారం తీసుకొని, ఒక గంట సేపు విశ్రాంతి తీసుకొన్నాడని 'టాస్' ప్రకటించింది.

భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం గం. 2 ని 15 లకు మేజర్ నికొలయేవ్ సోవియట్ రష్యా భూభాగంగుండా పయనిస్తూ, తాను క్షేమంగా వున్నట్టూ, నౌకలో అంతా మామూలుగా వున్నట్టూ, నౌక కిటికీ గుండా భూమి స్పష్టంగా కనిపిస్తున్నట్టూ తెలియజేశాడు.

మేజర్ నికొలయేవ్ తన భూ ప్రదక్షిణ సమయంలో రష్యా ప్రధాని క్రుశ్చేవ్‌కు తన అభినందనలు తెలియజేస్తూ, అంతరిక్షనౌకలోని పరికరాలన్నీ సక్రమంగా పనిచేస్తున్నాయని చెప్పినట్లు మాస్కో-రేడియో తెలియజేసింది.

ప్రధాని క్రుశ్చేవ్ పరామర్శ

మేజర్ నికొలయేవ్‌ను ప్రధాని క్రుశ్చేవ్ పరామర్శచేస్తూ, "నీవు చెప్పింది విన్నాను. నీవు కులాసాగా ఉన్నందుకు నాకు చాల సంతోషంగా ఉంది. నీవు ఈ అంతరిక్ష యాత్రను నిర్వహించడానికి చూపిన ధైర్యసాహసాలకు నేను చాలగర్వపడుతున్నాను" అని బదులు చెప్పినట్లు మాస్కో రేడియో తెల్పింది.

మేజర్ నికొలయేవ్, ఐరోపాను దాటుతూ, తూర్పుయూరపు కమ్యూనిస్టు రాజ్యాలకు, ఆఫ్రికా ఖండం గుండా పోతూ ఆఖండంలోని స్వేచ్ఛా పిపాసులైన ప్రజలకు తన అభినందనలు తెలియజేసినట్లు సోవియట్ వార్తా సంస్థ 'టాస్' ప్రకటించింది.

మేజర్ నికొలయేవ్ తన మొదటి ఆరుగంటల యాత్రలో భూమిని నాల్గు సార్లు చుట్టి వచ్చినట్లుగా 'టాస్' తెలియజేసింది.

సోవియట్ విజ్ఞప్తి

ఈ సందర్భంగా సోవియట్ ప్రభుత్వం ఒక ప్రకటనచేస్తూ, సోవియట్ రోదసీ నౌక "వోస్టక్-3" అంతరిక్ష పరిశోధనకోసం ప్రయోగించబడిందనీ, అందేత ఈ ప్రయోగ ఫలితాలవల్ల అన్ని దేశాలకు ఉపయోగం జరుగుతుందనీ తెలియజేసింది. అందువల్ల ఈదేశాలపైకొన్ని బాధ్యతలున్నాయనీ, శాంతియుతంగా జరిగే ఈ అంతరిక్ష పరిశోధనలకు ఏ దేశంకూడా ఆటంకం కలిగించే చర్యలకు ఒడిగట్టరాదనీ ఆ ప్రకటనలో కోరింది. అయినా అమెరికా ప్రభుత్వం చాలా రొమ్ముకు పోయే అణ్వాయుధ ప్రయోగాలు జరపడానికి ప్రయత్నిస్తున్నదనే విషయం అందరికీ తెలిసినదేననీ ఈ ప్రకటనలో తెలియజేసింది.

మూడో సోవియట్ అంతరిక్ష యాత్రికుడు భూప్రదక్షిణం చేస్తున్నాడు గనుక, తన బాధ్యతను గుర్తించాలని సోవియట్ ప్రభుత్వం అమెరికాకు విజ్ఞప్తి చేసింది.

బ్రిటన్‌లో

సోవియట్ రోదసీ యాత్రికుడు అంతరిక్షనౌకనుండి భూమిపైకి పంపిన వార్తా ప్రసారం విన్నటుగా, ఇంగ్లండులోని జోడ్రల్ బ్యాంకు రేడియో నక్షత్ర పరిశోధనశాల ప్రకటించింది

ఈ పరిశోధనశాల డైరెక్టర్ బెర్నార్డ్ లవెల్, ఈ అంతరిక్షయాత్ర చాలా రోజులు కొనసాగే పరిస్థితి గోచరిస్తున్నదనీ, అదే జరిగితే సోవియట్ రష్యా త్వరలోనే మానవుణ్ణి చంద్రమండలానికి పంపే ప్రయత్నం ఫలించవచ్చునని వ్యాఖ్యానించారు.

బ్రిటిష్ ఖగోళ పరిశోధన సంస్థ అధ్యక్షుడు డా॥ జి. ఆర్. హెపర్డ్ రష్యా అంతరిక్ష నౌక ప్రయోగంపై వ్యాఖ్యానిస్తూ, రష్యనులు గత అంతరిక్ష నౌకను ప్రయోగించిన తరువాత చాలా కాలానికి ఈ ప్రయోగం జరిగినందున ఇది మరికొంత సత్ఫలితాలనిస్తుందనే ఆశ వ్యక్తం చేశారు.

అమెరికా ప్రకటన

సోవియట్ ప్రభుత్వం అమెరికాను [illegible] అణ్వాయుధ పరీక్షలు జరపవద్దంటూ ఈనాడు చేసిన విజ్ఞప్తిని పురస్కరించుకొని అమెరికా విదేశాంగ శాఖ ఒక ప్రకటనచేసింది.

మేజర్ నికొలయేవ్ భూప్రదక్షిణ యాత్రలకు ఆటంకం కలిగించే విధంగా తాము ఏచర్య తీసుకొనదలచలేదని ఆ ప్రకటనలో తెలియజేసింది. మేజర్ నికొలయేవ్ సుగక్షేమంగా తన యాత్రను కొనసాగించి క్షేమంగా తిరిగి రావాలనే తాము వాంఛిస్తున్నట్లుగా ఆ ప్రకటనలో వివరించింది.

అధ్యక్షస్థానం ఖాళీచేసిన మేయర్

హైద్రాబాద్ కార్పొరేషన్ సమావేశంలో సంఘటన

హైద్రాబాదు, అగస్టు 10

బాలికల ఉన్నతపాఠశాలలకై స్థలం మంజూరుచేయడానికి వ్యతిరేకంగా కార్పొరేషన్ సభ్యుల్లో అధిక సంఖ్యాకులు నిర్ణయించడంవల్ల ఈనిర్ణయంలో తాను భాగస్వామిని కాదలచుకోలేదని హైద్రాబాదు మున్సిపల్ కార్పొరేషన్ మేయరు శ్రీ రామమూర్తి నాయుడు నేడు కార్పొరేషన్ సమావేశ అధ్యక్షపీఠాన్ని ఖాళీచేసి వెళ్ళిపోయారు.

ఆ తరువాత సభ్యులు శ్రీ నరసింహాచార్లు తాత్కాలికంగా సమావేశానికి అధ్యక్షులుగా ఎన్నుకొని ఈ స్థలాన్ని మంజూరు చేయాలనే స్థాయి సంఘ తీర్మానాన్ని ఓడించారు. 400 చదరపు గజాలున్న ఈ స్థలం హైద్రాబాదులోని బొగ్గులకుంటలో వుంది.

ఈ స్థలం పబ్లిక్ రాస్తా కాబట్టి దాన్ని బాలికల పాఠశాల భవన విస్తరణకు ఇవ్వడానికి వీలులేదని అధిక సంఖ్యాకులు అభిప్రాయపడ్డారు.

తాత్కాలిక అధ్యక్షుని ఎన్నిక విషయమై కొంత గందరగోళం ఏర్పడింది. ప్రతిపక్షానికి చెందిన 17 మంది అధికార పార్టీ వైఖరికి నిరసనగా సభ నుండి వాకౌట్ చేశారు.

ఈ స్థలాన్ని చదరపు గజం పది రూపాయల చొప్పున పాఠశాల భవన విస్తరణకై ఇవ్వాలని లోగడ స్థాయీ సంఘం సిఫార్సు చేసింది.

హైద్రాబాద్ నగర ఓటర్ల జాబితాను తెలుగు ఉర్దూ, హిందీలలో ప్రకటిస్తే అందువల్ల అయ్యే వ్యయమెంతో పరిశీలించవలసిందిగా కార్పొరేషన్ స్థాయీసంఘాన్ని కోరింది.

కార్పొరేషన్ సభ్యులకు ఇళ్లు

కొద్దిపాటి ఆదాయంవచ్చే వారికి కట్టించిన ఇళ్లు సికింద్రాబాదు మున్సిపల్ కార్పొరేషన్ వారు, కార్పొరేషన్ సభ్యులకు అక్రమంగా కేటాయించే విషయమై అడ్‌హాక్ కమిటీ సమర్పించిన నివేదిక నేడు సమావేశంలో చర్చకు రాగానే సభ్యులు ఒకరొకరే బయటికి వెళ్ళిపోయారు. కోరం లేనందువల్ల సభ వాయిదా వేయవలసి వచ్చింది.

ఈ సందర్భంలో తాను అడ్‌హాక్ కమిటీ నివేదికకు తెల్పిన భిన్నాభిప్రాయాన్ని, నివేదికకు చేర్చలేదని సోషలిస్టు సభ్యుడు శ్రీ దేవేంద్ర పురి గోస్వామి ఆక్షేపణ లేవదీశారు. నివేదిక గాని, భిన్నాభిప్రాయంగాని తమకు అందివ్వలేదని పలువురు సభ్యులు అభ్యంతరం చెప్పారు.

ఈ ఇళ్ళను కార్పొరేషన్ సభ్యులకు కేటాయిస్తూ స్థాయీ సంఘం చేసిన తీర్మానాన్ని ఎందుకు రద్దు చేయ కూడదో తెలుపవలసిందిగా కార్పొరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

18 రోజులుగా సిర్పూరు కార్మికుల నిరాహారదీక్ష

కార్మిక, యజమానుల ప్రతినిధుల సమావేశానికై ప్రభుత్వ సూచన

సిర్పూర్, ఆగస్టు 11

సిర్పూర్ పేపరుమిల్లు, సర్‌సిల్కు కార్మిక సంఘాల సభ్యులిద్దరు కార్మికులకు రావలసిన బోనస్ తదితర హక్కుల సాధనకోసం, జూలై 25 నుండి సిర్పూర్ కాగజ్ నగర్‌లో నిరాహార వ్రతం చేస్తున్నారు. నిరాహారవ్రతం ప్రారంభమైన నాటినుంచీ పేపరు, సిల్కు మిల్లులు రెండూ పనులు నిల్పివేశాయి.

ఈ సందర్భంగా పరిస్థితులు ప్రశాంతంగా ఉన్నాయి.

ప్రదేశ్ కార్మిక, రవాణా శాఖల మంత్రి ఈ వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించడంకోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ కార్యదర్శి, లేబర్ కమిషనర్, యజమానులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో ఈ 16న ఒక సమావేశం యేర్పాటు చేస్తున్నారు.

కార్మికుల సమస్యలను ఆ సమావేశంలో చర్చించనున్నారు గనుక, ఆ యిద్దరు కార్మికులచే నిరాహారవ్రతం విరమింపజేయవలసిందిగా ప్రదేశ్ ప్రభుత్వం ఆ రెండు సంఘాల నాయకులకు ఈనాడొక విజ్ఞప్తి చేసింది.

సిర్పూర్, సర్ సిల్కు, పేపరు మిల్లులలో పనిచేసే కార్మికుల హక్కుల కోసం శ్రీ దాసరి విశ్వేశ్వరరావు, శ్రీ గణేశ్ దూబే గారలు నిరాహారదీక్ష ప్రారంభించిన విషయం పాఠకులకు విదితమే.

ప్రతిరోజూ ఇ. యస్. ఐ. ఆసుపత్రి డాక్టరు వచ్చి వారిని పరీక్షిస్తున్నారు. వీరి ఇరువురి ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తున్నది 8వ తేదీ నాటికి శ్రీ విశ్వేశ్వరరావు 21 పౌనులు, శ్రీ దూబే 22 పౌనులు బరువు తగ్గినట్లు తెలుస్తున్నది

నిరాహారదీక్ష జరుగుతున్న స్థలం వద్ద స్త్రీలు, పురుషులు, 10 సంవత్సరాల లోపు వయస్సుగల పిల్లలతో సహా రోజూ వందమంది పైగా వచ్చి 12 గంటలు ఉపవాసముండి సానుభూతి తెలియచేస్తున్నారు. సిర్పూర్ కాగజ్ నగర్‌లో ఇంత పెద్దఎత్తున నిరాహార దీక్షలు కొనసాగించడం ఇదే మొదటి సారి.

శ్రీ విశ్వేశ్వరరావు, శ్రీ దూబేల ఆరోగ్యాన్ని గురించి ఇచ్చట కార్మికులు, ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికి మొత్తం 600 మంది పురుషులు, 100మంది స్త్రీలు, 100 మంది 10 సంవత్సరాల వయస్సు లోపుగల పిల్లలు 12 గంటలు ఉపవాసముండి వీరికి సానుభూతి తెలియచేశారు.

కాగజ్ నగర్ కుట్టుమిషన్ పనివాళ్లు వారి సంఘం తరఫున 8వ తేదీ తమ మిషన్లన్నీ ఆపివేసి, [illegible] 12 గంటలు ఉపవాసముండి తమ సానుభూతి తెలియచేశారు.

కాగజ్ నగర్ పద్మశాలి సంఘంవారు నలభైమంది సభ్యులు ఈ నెల 6వ తేదీ ఉదయం 6 గంటలనుండి సాయంత్రం 6 గంటలవరకు నిరాహారదీక్ష పూనారు.

యజమానులు కొత్త కార్మికులకు లేనిపోని ఆశలుచూపి దొంగతనంగా కంపెనీలో ముఖ్యమైనపనులు చేయించుకోవాలని ప్రయత్నించినప్పటికీ ఆ ప్రయత్నాలన్నీ విఫలమైనట్లు తెలుస్తున్నది.

యజమానులు యూనియన్ అధ్యక్షుడు శ్రీ జి. సంజీవరెడ్డిగారితో ఒప్పందం చేసుకోడానికి సిద్ధంగా లేరని, ఆ ఇరువురిమధ్య సుమారు 8 సంవత్సరాలనుండి యూనియన్ కార్యకలాపాలలో వచ్చిన తగాదాలే ఇందుకు కారణమని తెలుస్తున్నది.

శ్రీ విశ్వేశ్వరరావు, శ్రీ దూబేలు నిరాహారదీక్ష పూనిన స్థలంవద్ద 8వ తేదీ సాయంకాలం బహిరంగసభ జరిగింది. సభకు సుమారు 10 వేల మంది కార్మికులు, ప్రజలు హాజరైనారు ఈసభలో శ్రీయుతులు సి. హెచ్. బాబురావు, లాలాగార్, ప్రకాశరావు, పీర సతి, హరిసింగ్, ఆర్. బాబుగార్లు బిర్లా మేనేజిమెంటు అక్రమ చర్యలను ఖండిస్తూ మాట్లాడారు.

బీహార్ వైద్యుల పనివిరమణ

ఉపసంహరించుకోవాలని నిర్ణయం

పాట్నా, ఆగస్టు [illegible]

జూలై 27 నుండి పాట్నా, ధర్భాంగా మెడికల్ కాలేజి హాస్పిటళ్ళలో కొనసాగుతున్న పని విరమణను రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వినోదానంద ఝా, ఇచ్చిన హామీని పురస్కరించుకొని ఉపసంహరించుకోవాలని బీహార్ యంగ్ మెడికల్ గ్రాడ్యుయేట్సు అసోసియేషన్‌వారి సర్వసభ్య సమావేశం ఇక్కడ నిర్ణయించింది.

అధిక స్టైపెండులు, మంచి వసతులు కావాలనే కోర్కెలను సాధించుకునే నిమిత్తం ఈ ఉద్యమం ప్రారంభించబడింది.

ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీవల్ల తిరిగి పని ప్రారంభించాలని నిర్ణయం తీసుకొన్నారు.

కోర్టు ధిక్కరణ, శాసనసభా ధిక్కారాలకు సంబంధించిన చట్టాలను క్రమబద్ధం చేసే యత్నాన్ని పాట్నాలో సమావేశమైన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ పబ్లిక్ అఫైర్స్ సంఘం ఖండించింది.

సెప్టెంబరులో తూర్పు పాకిస్తాన్‌కు వినోబాభావే యాత్ర

కలకత్తా, ఆగస్టు 11

సెప్టెంబరు నెల మొదటి భాగంలో ఆచార్య వినోబాభావే తూర్పు పాకిస్తాన్‌లో రెండువారాలు గడుపుతారని అనుకుంటున్నారు. ఆయన అస్సాం నుండి బెంగాల్ వచ్చే సమయంలో తూర్పు పాకిస్తాన్ చేరుకుంటారని ఆశించబడుతున్నది.

అయితే ఆయనగారి ప్రోగ్రాం ఇంతవరకు ఎటువంటి నిర్దిష్ట స్వరూపం తీసుకోలేదు.

నేపాల్ పార్లమెంటులో మాజీ ప్రతిపక్ష నాయకునిపై జరిగిన హత్యాయత్నాన్ని నేపాల్ కాంగ్రెసు అధ్యక్షుడు సువర్ణ షంషేర్ ఖండించారు.

రేడియో

మంగళవారం, ఆగస్టు 14

శక 1884, శ్రావణ 23

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉదయం: 6-30 శుభోదయం, 6-35 భక్తిరంజని; 6-55 ప్రసార తరంగిణి, 7-0 తె. వా; 7-15 సంగీత శిక్షణ; 7-30 వి. ఎల్ జానకిరాం వీణ, 8-0 ఆం. వా; 8-15 హిం. వా; 8-30 సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 హై. వి; 1-0 సేంటం; 1-30 తె. వా; 2-0 వాతావరణ సూచన, సమాప్తి.

సాయంత్రం: 6-0 స్థానిక ప్రకటనలు, 6-5 ప్రాం. వా; 6-15 సాహిత్య సంచిక - సాహిత్య కార్యక్రమం, సారస్వతములో సొంత గొంతుకలు; ధూర్జటి కాళహస్తి మహాత్మ్యం ప్రసంగం, వ్యాఖ్యాత: చిట్టిప్రోలు కృష్ణమూర్తి; 6-30 గ్రామస్థులకు, 7-0 తె. వా; 7-15 గ్రామస్థులకు, 7-45 హై. వి; 8-0 ఇంద్రధనుస్సు-పరిణీత నాటిక, రచన: అమరేంద్ర. నిర్వహణ: కందూరి సుబ్బారావు; 8-30 ఉభయ కుశలోపరి, 8-45 ఫిల్మ్ సంగీతం; 9-0 ఆం. వా, 9-15 గానసుధ, 9-30 హై. వి. వలె; 10-30 వాతావరణ సూచన, సమాప్తి.

హైదరాబాద్ - ఎ

405.4 మీ (740 కిలోసై.)

ఉదయం: 6-30 సుప్రభాత్, 6-35 వి. వి; 6-55 కార్యక్రమ వివరణ, 7-0 తె. వా; 7-15 వి. వి, 7-30 వి. వలె, 8-0 ఆం. వా, 8-15 హిం. వా; 8-30 శంకరరావు: సితార్, 8-45 సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 కార్మికులకు; 1-0 కుమ్ సంగత్: ఉపబిందు - గీత్ భజన్; 1-15 గోవింద రావ్ రాజూర్కర్: ఖయాల్, 1-30 వాద్యగోష్ఠి; 1-50 తె. వా; 2-0 హై. వి. వలె; 2-10 [illegible] 2-20 హై. వి. వలె, 2-30 వాతావరణ సూచన, సమాప్తి.

సాయంత్రం: 6-0 స్థానిక ప్రకటనలు, 6-5 ప్రాం. వా; 6-15 వి. వి; 6-30 నగరవాణి: స్వాతంత్ర్యవాహిని-నాటిక రచన: దాశరథి 7-0 తె. వా; 7-15 కన్నడ కోకిలకు; 7-30 సుగమ్ సంగీత్; 7-45 రేడియోవార్తావాహిని; 8-0 ఈద్ - ఎ - మిలా; 8-15 ఉత్తరాలకు జవాబులు; 8-30 కర్ణాటక గాత్ర సంగీతం, 9-0 ఆం. వా; 9-15 ఉ. వా; 9-30 హిందూస్థాని సంగీత కచేరీ; 11-0 వాతావరణ సూచన, సమాప్తి.

హైదరాబాద్ - బి

60.12 మీ (4990 కిలోసై.)

ఉదయం: 6-30 సుప్రభాత్, 7-45 సమాప్తి

8-0 హై. ఎ వలె; 8-45 సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 హై. ఎ. 2-0 కర్ణాటక గాత్ర సంగీతం; 2-30 వాతావరణ సూచన, సమాప్తి.

సాయంత్రం: 6-0 హై. ఎ వలె, 6-30 గ్రామస్థులకు, 7-0 తె వా, 7-15 గ్రామస్థుల రేడియోగోష్ఠి, 7-45 హై. ఎ. వలె, 8-0 లయచిత్రం, 8-15 హై. ఎ. వలె, 9-15 కాంచనమాల: నాటిక; 9-30 హై. ఎ. వలె. 11-0 వాతావరణ సూచన, సమాప్తి.

మద్రాస్ - బి

ఉదయం: 6-45 మంగళగానం; 7-0 తె. వా, 7-15 సంగీత మంజరి; 7-30 వయొలిన్; 8-0 ఆం. వా, 8-15 సమాప్తి.

మధ్యాహ్నం 12-0 కార్మికులకు (తమిళం), 1-0 కదంబం, 1-30 ఆం. వా, 1-40 గీతమంజరి, 1-50 తె. వా, 2-0 మధుర గీతం, 2-40 సమాప్తి.

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం; 5-50 స్థానిక ప్రకటనలు, వాణిజ్య వార్తలు (ఆంగ్లం), 6-0 ఆం. వా, 6-15 కార్యక్రమ వివరణ (తమిళం); 6-20 మీలాడిన దీ: ప్రసంగము (తమిళం ఎ. కె. ఎ. సమద్, 6-30 జ్ఞానం సుబ్రహ్మణ్యన్, 7-0 తె వా, 7-15 గోటువాద్యం: విలకు విద్యాంసుడు; 7-30 చిత్రగానం, 7-45 క్లారినెట్; 9-0 ఆం. వా; 9-15 ఊరట్టు: కథానిక (తమిళం) రచన: కె. శ్రీనివాసన్, 9-30 కాంతివనం: డాక్యుమెంటరి ఫీచర్; 10-30 సమాప్తి.

డాక్టర్‌గా నుండండి

ఇంటిలో విరామంగా కూర్చొని వుండేటప్పుడు పోస్టల్ ట్యూషన్ ద్వారా హోమియోపతి చదువుకొని [illegible] [illegible] పొందండి. ప్రాస్పెక్టస్ ఉచితము. వివరములకు వ్రాయండి.

INDIAN HOMOEOPATHIC COLLEGE
(VAV) JULLUNDUR CITY

మలయా సోషల్ వెల్‌ఫేర్ సర్వీసు

లాటరీ టిక్కెట్లు

ఆగస్టు డ్రా: 31-8-1962

రు. 15,00,000/- (పదిహేను లక్షలు) పొందుటకు మలయా గవర్నమెంటు టిక్కెట్లద్వారా మీ అదృష్టమును పరీక్షించుకొనండి. ఒక టిక్కెట్టు ఖరీదు రూ. 3-50 న. పై ముందుగా డబ్బు చెల్లించవలయును. టిక్కెట్లన్నియు వాటర్ మార్కు కలవి. ఫలితములు సింగపూరు రేడియోలో ప్రకటించబడును. ఉత్తర ప్రత్యుత్తరములు ఇంగ్లీషులో మాత్రమే. ప్రతి నెల చివరలో డ్రా తేదీ. ఇండియాలో చాలామంది మా సంస్థద్వారా బహుమతులు గెలిచినారు. అందులో మీరుకూడ ఒకరు ఎందుకు కాకూడదు?

Krishna Corporation (Regd)
Pudukkottai, Tiruchi Dt.,
Madras State.

విజయవాడ మున్సిపాలిటి

టెండరునోటీసు

విజయవాడ మున్సిపాలిటీ వీధి రోడ్డుపనులు, మరియు పబ్లిక్ [illegible] రు. 5,02,160/-ల విలువగల పనులు చేయుటకు నిర్ణీత ఫారములో సీలువేసిన టెండర్లు కమిషనర్ అండ్ స్పెషల్ ఆఫీసరుగారికి [illegible]-62 సాయంత్రం గం. 3 లకు చేరునట్లు కోరబడుచున్నవి. అదే రోజు సాయంత్రం గం. 4 లకు టెండర్లు తెరువబడును. టెండరు ఫారములు, కాంట్రాక్టు డాక్యుమెంట్లు పని ఎస్టిమేటు మొత్తం, టెండరు డిపాజిట్లు మొదలైన వివరములు 31-8-62 సాయంత్రం గం. 3 ల వరకు మున్సిపల్ ఇంజనీర్‌వారి ఆఫీసులో ఆఫీసు పనిచేయు వేళలలో పొందవచ్చును.

(సం.) మహమ్మద్ జబీర్ అహ్మద్,
కమిషనర్ అండ్ స్పెషల్ ఆఫీసరు.

పోలింగ్ చురుకుగా జరపడానికి చర్యలు

చీఫ్ ఎలక్టొరల్ ఆఫీసర్ల సమావేశంలో సూచనలు

హైదరాబాద్, ఆగస్టు 11

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ శ్రీ కె. వి. కె. సుందరం అధ్యక్షతన ఇక్కడ ప్రారంభమైన చీఫ్ ఎలక్టొరల్ ఆఫీసర్ల సమావేశం మొదటి దశ నిన్న ఇక్కడ ముగిసింది.

అన్ని రాష్ట్రాల్లోను పోలింగ్ కార్యక్రమాన్ని, ఓట్ల లెక్కింపు పద్ధతి, తదితర విషయాలనుగురించి సమావేశం చర్చించింది.

పోలింగ్ కార్యక్రమాన్నింకా చురుకుగా కొనసాగించేందుకు కావలసిన పోలీసు సిబ్బంది, ఇతర ఎన్నికల సిబ్బంది తగినంతమంది దొరకడం ఇబ్బందిగా ఉన్నదని కొందరు ఆఫీసర్లు చెప్పారు. ఆ సిబ్బంది తగినంత సంఖ్యలో లభ్యం కాకపోతే ఇంకా చురుకుగా పోలింగును కొనసాగించడం కష్టమని చెప్పారు. ఒక రోజులో పోలింగ్ జరిగిపోవడం వల్ల చాల అక్రమాలకు మందు పెట్టినట్లవుతుందిగాని అది నిర్వహించడం చాల రాష్ట్రాల్లో సాధ్యం కావడం లేదన్నారు.

గత జనరల్ ఎన్నికల్లో ఢిల్లీ, తూర్పు పంజాబులలో పోలింగ్ ఒక్క రోజులోనే పూర్తయింది.

స్వేచ్ఛగా ఎవ్వరైనా ఉపయోగించుకొనే గుర్తులసంఖ్యను పెంచాలని సమావేశం అంగీకరించింది. ఎందుకంటే కొన్ని నియోజకవర్గాల్లోఉన్న గుర్తులన్నింటికంటె ఎక్కువమంది అభ్యర్థులు గత ఎన్నికల్లో పోటీ చేశారు.

ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి ఎంతమంది ఓటర్లను కేటాయించాలి అనే అంశాన్ని గురించికూడ సమావేశం పరిశీలించింది.

ఎన్నికల నిర్వహణలోను, ఓటర్ల జాబితాను తయారు చేయడంలోను పంచాయతీల కెక్కువ బాధ్యత ఇవ్వాలని ఎలక్షన్ కమిషనర్ అన్నారు.

బూతులో ఓటింగు పద్ధతిని వివరించడం మానివేయరాదుగాని ఫిల్ములు, తదితర మార్గాల ద్వారా ఓటింగు పద్ధతిని బాగా నేర్పాలని సూచించారు.

పోలింగ్ అయిపోయిన వెంటనే పోలింగ్ కేంద్రంలోనే ఓట్లను లెక్కించాలన్న సూచనపై భేదాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అందులో శాంతి, భద్రతల సమస్య ఇమిడి ఉన్నదని కొందరు తెలియపరిచారు. లెక్కింపును త్వరత్వరగా చేసేయరాదని, నిదానంగా జాగ్రత్తగా చేయాలని సూచించారు. మధ్యలో విరామంలేకుండా లెక్కింపు కానిచ్చే వేయకూడదన్న పద్ధతిగూడ మంచిది కాదని సూచించారు.

లెక్కింపు సమర్థవంతంగా జరగాలంటే ఒక్కొక్క రిటర్నింగ్ ఆఫీసరు పర్యవేక్షణ కింద రెండు శాసనసభా నియోజకవర్గాలకంటె ఎక్కువ ఉంచరాదని సూచించారు. లెక్కింపు ప్రారంభించకముందు పార్లమెంటరీ, శాసనసభ బాలట్ పత్రాలు విడదీయడం మంచిదని, అవిధంగా చేస్తే అభ్యర్థుల ఏజంట్లకు ఎక్కువ సంతృప్తికరంగా ఉంటుందని కొందరు సూచించారు.

అఖిల భారత సర్వీసుల ఏర్పాటు

లోక్‌సభలో శ్రీ కె. వి. రఘునాధరెడ్డి విమర్శ

న్యూఢిల్లీ, ఆగస్టు 9

పదిహేనేండ్లనాడు స్వాతంత్ర్యం లభించినా అఖిల భారత సర్వీసుల విషయంలో మనమింకా పాత అలవాట్లనుండి బయటపడలేకపోయామని లోక్‌సభలో ప్రసంగిస్తూ శ్రీ కె. వి. రఘునాధరెడ్డి చెప్పారు.

యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ వ్యవహారాలపై ప్రసంగిస్తూ ఇంకా ఇలా అన్నారు.

"దేశంలో సోషలిజాన్ని స్థాపించడంలో సర్వీసులపాత్ర ఏమిటి? బ్రిటిష్ హయాంనాటి సివిల్ సర్వీసు దాని లక్ష్యాల సాధనకై చాలా శక్తివంతంగానే పనిచేసింది; కాని ఇప్పుడు మన లక్ష్యాలు మారాయి గాని ఆనాటి సామర్థ్యం లోపించింది.

"కాంగ్రెసు ఆవడి, నాగపూర్, మధురై మహాసభలలో నిర్ణయించిన లక్ష్యాలను యీనాటి సర్వీసులు గుర్తించాయా? లేదు.

"దీనంతటికీ ఒకటే పరిష్కారమార్గం వుంది: ఈనాటి అఖిలభారత సర్వీసులను, పబ్లిక్ సర్వీసు కమిషన్ [illegible] ప్రాతిపదిక మీద పునర్నిర్మించాలి. ఈ సర్వీసులలో పని చేసేవారు యంత్రాలు కాదని దూరదేశ రూపురేఖలను అనేక పట్టాలను ఆధారం చేసుకొని తీర్పు దిద్దవలసినవారని మనం గుర్తించాలి.

"పబ్లిక్ సర్వీసులలోకి హెచ్చు మంది మేధావులను తీసుకోవాలని కోరుతున్నా "వ్యక్తిత్వాన్ని" ఒకవ్యక్తి పరీక్షించడమనేది వుంది. ఇది ఒక్క మానసికమైనది మాత్రమే కాదు. దీనికి సాంఘిక-మానసిక లక్షణం కూడ వుంది. పబ్లిక్ సర్వీసు కమిషన్‌గాని, మంత్రులుగాని ఎంతవరకు అర్థం చేసుకొన్నారో నాకు తెలియదుగాని, మానసికాభివృద్ధి మీద పరిసరాల ప్రాబల్యంకూడా వుంటుందని గుర్తించాలి. అప్పుడే మానవ వ్యవహారాలలో యీ "వ్యక్తిత్వం" పాత్రను అర్థం చేసుకోగలం. ఇక వెనుకబడినకులాలకి, తెగలకు చెందినవ్యక్తి యీ పరీక్షలకు నిలబడలేడు. అదిఅతని తప్పు కాదు. వారందరినీ వారి జీవితంలో అనేక తరాలుగా ముంచివుంచిన సంఘానిదే ఆ తప్పు. కాబట్టి వారికి సంబంధించి వంతవరకు ఆ పరీక్షను వదలివేయాలి.

"ఈ అఖిల భారత సర్వీసుల సంఖ్యను పెంచేకొద్దీ పెరుగుతున్నది. హెల్తు సర్వీసులు, అడవులు, విద్యా సర్వీసులను కేంద్రీకృతం చేయాలన్న ఆలోచన వున్నదంటున్నారు. ఇది చాలా ప్రమాదకర ధోరణి. ఇందువల్ల రాష్ట్రాలకు రాజ్యాంగం హామీ ఇచ్చిన స్వయం పాలనాహక్కు నిరాకరింపబడుతుంది.

"పైగా రాష్ట్రాల్లో పనిచేసే యీ సర్వీసుల సభ్యులలో ఒక ధోరణి వుంది. తాము ఏమైనా చేయవచ్చుననీ, ఏదైనా శిక్షణాచర్య తీసుకోవలసివస్తే రాష్ట్ర ప్రభుత్వాలు ఏమీ చేయలేవనీ వారు తలుస్తున్నారు. కాబట్టి కేంద్ర ప్రభుత్వానికి సరాసరి బాధ్యతగల వ్యవహారాలకే ఈ అఖిల భారత సర్వీసులను పరిమితం చేయాలని కోరుతున్నాను. రాష్ట్ర ప్రభుత్వాలు తమ సర్వీసులను ఏర్పాటు చేసుకొని, తమ పరిపాలనా వ్యవహారాలను నిర్వహించుకోవచ్చు."

సిరియా ఈజిప్టుల ద్విపక్ష సంప్రదింపులు జరపాలన్న అరబ్‌లీగ్ సూచనను ఈజిప్ట్ తిరస్కరించింది.

అనుబంధ అధికార భాషగా ఇంగ్లీషుకు వ్యతిరేకత

అఖిలభారత భాషల సదస్సులో వక్తల ప్రసంగాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 11

దేశంలో ఇంగ్లీషును అనుబంధ అధికార భాషగా చేయడానికి రాజ్యాంగాన్ని సవరించాలన్న ప్రయత్నాన్ని ప్రజలంతా ప్రతిఘటించాలని కోరుతూ నేడిక్కడ ఆరంభమైన అఖిల భారత భాషల సదస్సులో వక్తలు విజ్ఞప్తి చేశారు.

దేశంలోని ప్రముఖ హిందీ భాషావాదులు యీ సదస్సులో పాల్గొంటున్నారు.

వివిధ ప్రాంతాల నుండి 300 మంది హాజరైన యీ సభలో పార్లమెంటు సభ్యుడు మామావారేర్కర్ ప్రసంగించారు. కాలనిర్ణయమేమీ లేకుండా ఇంగ్లీషు భాషను అనుబంధ అధికార భాషగా చేస్తూ రాజ్యాంగాన్ని సవరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఇటీవల పార్లమెంటులో హోంమంత్రి చేసిన ప్రకటనకు మామావారేర్కర్ విచారం వెల్లడించారు.

పూర్వం నిర్ణయించినట్లుగానే 1965 లో ఇంగ్లీషుకు స్వస్తి చెప్పడానికి ప్రజలంతా కృతనిశ్చయులు కావాలన్నారు.

దేశ పరిపాలన మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లాలంటే దేశ భాషల మీద ఇంగ్లీషుకున్న పట్టు సడలించాలన్నారు.

నూటికి ఇద్దరుగా వున్నవారు మాత్రమే ఇంగ్లీషును కోరేవారని, వారే తమ స్వార్థంకోసం ఆ భాషను పోషింపచేస్తున్నారని చెప్పారు.

అంతకుపూర్వం ఆహ్వాన సంఘ అధ్యక్షుడు డా॥ రఘువీర ప్రతినిధులకు స్వాగతం చెప్పారు. ఈ సదస్సు జయప్రదం కావాలని కోరుతూ సందేశాలు పంపినవారిలో మాజీ రాష్ట్రపతి డా॥ రాజేంద్ర ప్రసాద్, వినోబాభావే, డా॥ లోహియా మున్నగువారున్నారు.

నేటి సమావేశంలో శ్రీ ఎం. ఎస్. అణే, సేఠ్ గోవిందదాస్, శ్రీయుతులు వి. జి. దేశపాండే, ప్రేమనాధడోగ్రా, వి. ఆర్. పోద్దియా మున్నగువారు పాల్గొన్నారు.

సదస్సును ప్రారంభించిన కాకా కాలేల్కర్ మాట్లాడుతూ ఉన్నత వైజ్ఞానిక విషయాలను, అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపాదించడానికై ఇంగ్లీషును బోధించడానికి తాను వ్యతిరేకి కాదనీ, కాని దేశ ప్రజల భాషలో కాక పరిపాలన ఎందుకు సాగించరో బోధపడడంలేదని చెప్పారు.

ఓట్లు కావాలంటే ప్రజలను వారి భాషలోనే సంబోధించే నాయకులే ఇప్పుడు పరిపాలన మాత్రం ప్రజలకు అందరాని [illegible] ఇంగ్లీషులోనే జరపాలని ఎందుకు చెబుతున్నారని ప్రశ్నించారు.

దేశంలో నూటికి ఇద్దరికి మాత్రమే ఇంగ్లీషు బోధిస్తూ కోట్లాది భారత ప్రజలు దేశంలో ఏమేమి జరుగుతున్నదో తెలుసుకోకుండా అవకాశం లేకుండా చేస్తున్నారని విమర్శించారు.

"అంగ్రేజీ హటావో"

అలహాబాద్, ఆగస్టు 11

హిందీ భాషకు సరైన స్థానంలో పట్టం కట్టాలని కోరుతూ "ఇంగ్లీషును తొలగించు" (అంగ్రేజీ హటావో) సంఘ సదస్సులో నేడిక్కడ తీర్మానించారు.

భారత ప్రభుత్వం అనుసరించే భాషా విధానాన్ని విమర్శిస్తూ, దాని సహాయ నిరాకరణ వైఖరివల్లనే హిందీ భాష దెబ్బతింటున్నదన్నారు.

ఈ సదస్సులో డా॥ రాం మనోహర్ లోహియా మాట్లాడుతూ మెజారిటీ ప్రజలు హిందీని మాట్లాడుతున్నారనీ, దానికి తగిన ప్రాముఖ్యం, తగు స్థానం కల్పించాలన్నారు.

మూడవ అఖిలభారత ఇంగ్లీషు బహిష్కరణ మహాసభ హైద్రాబాద్‌లో వచ్చే అక్టోబరులో జరుపుతామని డా॥ లోహియా ప్రకటించారు.

రేడియోహిందీవార్తలపై సోషలిస్టుల ప్రదర్శన

కలకత్తా, ఆగస్టు 11

ఆలిండియా రేడియోలో హిందీ వార్తల బులిటిన్‌ల ప్రసారానికి వ్యతిరేకంగా సోషలిస్టుపార్టీ వాలంటీర్లు ఆగస్టు 15వ తేదీన చేపట్టదలచుకున్న నిరసన ప్రదర్శనను వాయిదా వేసుకున్నట్లు పార్టీ కార్యదర్శి సర్దార్ కర్తార్ సింగ్ తాజే నేడిక్కడ అన్నారు.

ఆలిండియా రేడియో హిందీ వార్తా బులిటన్ల విషయమై పరిశీలించేందుకు ప్రభుత్వం ఒక కమిటీని నియమించడం దృష్ట్యా ఇటువంటి నిర్ణయం తీసుకున్నామని ఆయన అన్నారు.

సింహళంలో బస్సు కార్మికుల సమ్మె

కొలంబో, ఆగస్టు 11

సింహళ రవాణా సంస్థకు చెందిన సుమారు 900 మంది బస్ కార్మికులు నేటి ఉదయం హఠాత్తుగా సమ్మె చేశారు. దేశంలోని అనేక రూట్లలో బస్సు ప్రయాణాలు బంద్ అయ్యాయి. ఒక డ్రైవరును [illegible] చేశాడని ఆరోపించి అధికారులు సస్పెండు చేసినందుకు నిరసనగా ఈ సమ్మె జరిగింది.

బెర్లిన్‌లో పశ్చిమదేశాల కవ్వింపుచర్యల ఉధృతం

సోవియట్ హెచ్చరికకు అమెరికా తిరస్కృతి

బెర్లిన్, ఆగస్టు 12

పశ్చిమ బెర్లిన్ వైపునుండి పశ్చిమదేశాలు ఇటీవల కవ్వింపు చర్యలను ఉధృతం చేస్తున్నాయని సోవియట్ యూనియన్ చేసిన ఆరోపణను అమెరికా విదేశాంగశాఖ గతరాత్రి తిరస్కరించింది. సోవియట్ ఆరోపణలు పూర్తిగా నిరాధారాలని అన్నది. అడ్డుగా గోడను కట్టడంవల్లనే నగరంలో ఉద్రిక్తత ఏర్పడిందని ఆరోపించింది.

పశ్చిమదేశాలకు రష్యా హెచ్చరిక

తూర్పుజర్మనీ, సోవియట్ యూనియన్, ఇతర సోషలిస్టుదేశాలకు వ్యతిరేకంగా పశ్చిమబెర్లిన్‌నుంచి కవ్వింపు చర్యలను ఉధృతంగా సాగిస్తున్నారని అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సులకు పంపిన లేఖలో సోవియట్ యూనియన్ తెలియజేసినట్లు టాస్ వార్తాసంస్థ నిన్న ప్రకటించింది.

బెర్లిన్ "గోడ" వార్షికోత్సవంతో కవ్వింపు చర్యలను ఉధృతం చేయడాన్ని సోవియట్ యూనియన్ ఆ లేఖలలో గర్హించింది. ఆ లేఖలలో ఇలా ఉన్నది. "తూర్పుజర్మనీ, పశ్చిమబెర్లిన్ మధ్యగల సరిహద్దు రక్షణకు, [illegible] తూర్పుజర్మనీ ప్రభుత్వం చర్యలను తీసుకొని ఈ ఆగస్టు 13కు ఒక సంవత్సరం అవుతుంది. తూర్పుజర్మనీ, ఇతర సోషలిస్టుదేశాలకు వ్యతిరేకంగా శత్రు చర్యలను, గూఢచారి కార్యకలాపాలను సాగించడానికి పశ్చిమ బెర్లిన్ కేంద్రం కావడంవల్ల తూర్పు జర్మనీ ప్రభుత్వం రక్షణ చర్యలను తీసుకొనవలసి వచ్చింది. ఆగస్టు 13 వార్షికోత్సవం పేరుతో పశ్చిమబెర్లిన్ అధికారులు కొత్తగా తీవ్రమైన కవ్వింపు చర్యలకు పూనుకుంటున్నారు. బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సుల మద్దతుతోనే ఇది జరుగుతున్నది.

సరిహద్దు గోడను కూల్చివేయడానికి యత్నించడం, ప్రాణనష్టం కలిగే విధంగా బాంబులను పేల్చడం, తూర్పు జర్మనీ, తదితర సోషలిస్టు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా విధ్వంసక చర్యలను సాగించాలని ప్రోత్సహించే కరపత్రాలను చల్లడం మున్నగు కవ్వింపు చర్యలు పశ్చిమ బెర్లిన్ సాగిస్తున్నది. ఈ చర్యల ఫలితాలకు వాటిని సాగించేవారు, మద్దతు ఇచ్చేవారు బాధ్యత వహించవలసివుంటుంది" అని సోవియట్ ప్రభుత్వం హెచ్చరించింది.

బెర్లిన్ "గోడ" వార్షికోత్సవం [illegible] రేపు పశ్చిమ బెర్లిన్ మేయర్ విల్లీ బ్రాంట్, పశ్చిమ జర్మనీ అధ్యక్షుడు హెన్రిక్ ల్యూబ్కేల రేడియో ప్రసంగాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ల్యూబ్కే పశ్చిమ బెర్లిన్ స్వయంగా వస్తున్నారు. చర్చిలలో ప్రార్థనలను కూడ ఏర్పాటు చేశారు. సాయంత్రం ఒక గంట అందరూ బయటకు రావడం మానివేసి "స్వచ్ఛందంగా కర్ఫ్యూ" అమలు పరచాలట. మధ్యాహ్నం 12 గంటలకు 3 నిముషాల నిశ్శబ్దం పాటించడం వార్షికోత్సవ కార్యక్రమంలో మరో భాగం.

తూర్పు జర్మనీ సరిహద్దు సైనికుల సంఖ్యను ప్రతిచోట రెండునుంచి మూడుకు పెంచాలని పశ్చిమ బెర్లిన్ పోలీసులు అన్నారు.

మద్రాసులో భీమా ఉద్యోగుల ప్రదర్శన

మద్రాసు, ఆగస్టు 10

జీవిత భీమా కార్పొరేషన్ ఉద్యోగుల కోర్కెల విషయంలో కార్పొరేషన్ అధికారుల మొండి వైఖరిని నిరసిస్తూ నిన్న మద్రాసు జార్జిటౌన్, మౌంట్ రోడ్డు ప్రాంతాలలోని కార్పొరేషన్ ఆఫీసులముందు ఉద్యోగులు ప్రదర్శనలు జరిపారు.

జీతాల స్కేళ్ళను సవరించాలనీ, జీవన వ్యయసూచికాన్ని బట్టి కరువు భత్యం ఇవ్వాలనీ, ఇంటి అద్దె అలవెన్సు తగినంత మొత్తం చెల్లించాలనీ, బోనస్ ఇవ్వాలనీ, వైద్య సౌకర్యాలు కల్పించాలనీ వీరు కోరుతున్నారు.

ఎడతెగని సంప్రదింపుల అనంతరం, కార్పొరేషన్ అధికారులు, ఇప్పటి కరువు భత్యంలో కొంత మాత్రమే మూలవేతనంలో కలుపుతామని, కొద్దిగా ఇంటి అద్దె ఇస్తామని చెప్పారు.

అదనపు శిస్తుబిల్లుకు చీరాల కౌన్సిల్ నిరసన

చీరాల, ఆగస్టు 10

అదనపు శిస్తుబిల్లును తీవ్రంగా నిరసిస్తూ, దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ చీరాల మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.

భారత సేవక్ సమాజ్

శ్రీ నెహ్రూ సందేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 11

భారత సేవక్ సమాజ్ 11వ వార్షికోత్సవ సందర్భంగా ప్రధాని నెహ్రూ ఒక సందేశం పంపుతూ అనేక విధాలుగా దాని సభ్యులు చేసిన సాంఘిక సేవకు సమాజ్‌ని అభినందిస్తున్నానన్నారు. ఈ సేవ ఇంకా కొనసాగగలదనీ, మరింతగా వ్యాప్తిచెంది ఇంకా సమర్థవంతం కాగలదని ఆశిస్తున్నాననీ తెలిపారు.

ఈ సందర్భంలోనే కేంద్ర ప్రణాళికా మంత్రి ఒక రేడియో ప్రసంగం చేస్తూ భారతసేవక్ సమాజ్ చేసే కృషికి ప్రజలంతా తోడ్పడాలని విజ్ఞప్తిచేశారు.

సమాజంలోని ప్రతివ్యక్తికీ, ప్రతి కుటుంబానికీ పోషణ, దుస్తులు, ఇంటి వసతి, విద్య, ఆరోగ్యం అన్నహక్కుల్లో వీటిని అందజేయడానికి ఇకముందు యీ సమాజం కృషి చేస్తుందని చెప్పారు.

పట్టణప్రాంతాలలో మురికి పేటలలో యీ సమాజం వారు సాంఘిక సేవ చేస్తున్నారని చెప్పారు.

పారిశ్రామికవాడలో శిక్షణ కేంద్రం ప్రారంభం

విజయవాడ, ఆగస్టు 9

ఆంధ్రప్రదేశ్ ఉత్పాదక సంఘం ఆధ్వర్యంలో, వస్తువుల ఉత్పాదన, ప్లానింగ్, కంట్రోలు విషయాలలో శిక్షణ కేంద్రాన్ని విజయవాడలోని పారిశ్రామికవాడలో యిటీవల ప్రారంభించారు. సంఘం ప్రాంతీయ డైరెక్టర్ శ్రీ యస్. రామలింగం శిక్షణ తరగతులను నడుపుతున్నారు.

భూస్వాముల కనుకూలంగా కేరళ భూసంస్కరణల బిల్లు మార్పుకు ప్రభుత్వ యత్నం

పాల్ఘాట్ సభలో లాయల్పూరి విమర్శ

పాల్ఘాట్, ఆగస్టు 11

కేరళ భూసంస్కరణల బిల్లును పూర్తిగా అమలుజరపకుండా భూస్వాముల కనుగుణంగా ఆ బిల్లును మార్చాలని రాష్ట్రప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని అఖిలభారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి శ్రీ జగ్జిత్ సింగ్ లాయల్పూరి నిన్న ఇక్కడొక బహిరంగ సభలో ప్రసంగిస్తూ అన్నారు.

బిల్లులోని కొన్ని సెక్షన్లను మాత్రమే ప్రభుత్వం అమలు జరుపుతున్నదని శ్రీ లాయల్పూరి చెప్పారు.

భూములపై జెన్మీల (భూస్వాముల)కు గల యాజమాన్యపు హక్కును రద్దు చేయడం కిసాన్ సభ లక్ష్యమన్నారు. అందుకోసం రైతులంతా ఐక్యంగా నిలబడాలని శ్రీ లాయల్పూరి విజ్ఞప్తి చేశారు. "చిన్న చిన్న భూఖామందులను తమ వైపుకు తిప్పుకోవాలని జెన్మీలు ప్రయత్నిస్తున్నారు. తద్వారా భూసంస్కరణల చట్టాన్ని ఎందుకూ పనికిరానిదిగా చేయాలని వారి ఊహ. ఎంత శ్రమకైనా ఓర్చి చట్టాన్ని రక్షించుకోవాలి" అని శ్రీ లాయల్పూరి అన్నారు.

అంతకుముందు రైతులతో పట్టణంలో పెద్ద ఊరేగింపు జరిగింది.

45 మంది డి. ఎమ్. కె. వారికి శిక్షలు

తిరుచి, ఆగస్టు 12

కరూరు సబ్ కలెక్టర్ ఆఫీసు, తాలూకా ఆఫీసుముందు పికెటింగ్ చేసినందుకు 45 మంది డి. ఎం. కె. వాలంటీర్లను నేడు అడిషనల్ ఫస్టుక్లాసు మేజిస్ట్రేటు శ్రీ చిదంబరనాథన్ [illegible] విధించారు.

శిక్షలు పడ్డవారిలో కరూర్ మునిసిపల్ కౌన్సిల్ సభ్యుడు శ్రీ వైరపెరుమాల్ గారుకూడా వున్నారు.

ఢిల్లీ కంటోన్మెంట్ లైట్లు వెలగవు

న్యూఢిల్లీ, ఆగస్టు 11

ఢిల్లీ కంటోన్మెంటులోని వీధిలైట్లు వెలిగించడం వెంటనే మానివేస్తున్నారు. రక్షణశాఖ సంస్థల కన్నిటికీ మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసువారే విద్యుచ్ఛక్తిని సప్లయి చేయబోతున్నారు. ఈ చర్యలు ఢిల్లీలో విద్యుచ్ఛక్తి సప్లయిలో ఏర్పడిన సంక్షోభంవల్ల అవసరమైనాయి.

రక్షణశాఖ వారికి సైనిక విద్యుత్కేంద్రం నుంచి విద్యుత్తు సప్లయి అవుతుంది. ఇకనుండి ఢిల్లీ మునిసిపాలిటీ సప్లయిచేసే విద్యుత్తులో సగం తగ్గుతుంది.

మునిసిపాలిటీనుండి తీసుకొనే విద్యుత్తును సాధ్యమైనంత తక్కువగా తీసుకోవాలని రక్షణశాఖ మంత్రి శ్రీ కృష్ణమీనన్ సైన్యాధికారులకు ఉత్తర్వు చేసిన ఫలితంగా యీ ఏర్పాటు జరిగింది.

కాంగ్రెసు కార్యవర్గం

న్యూఢిల్లీ, ఆగస్టు 11

రేపిక్కడ సమావేశం కాబోయే కాంగ్రెసు కార్యవర్గం రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో కాంగ్రెసు వ్యవహారాలను దర్యాప్తు చేసిన క్రమశిక్షణా సంఘం నివేదికను పరిశీలించి, ఆ రెండు రాష్ట్రాల కాంగ్రెసు మంత్రివర్గాలకు స్థిరత్వం చేకూర్చే చర్యలు తీసుకోబోతున్నది.

ముఖ్యమంత్రి శ్రీ మండ్లోయ్ నే తిరిగి నాయకుడుగా ఎన్నుకొన్నందున మధ్యప్రదేశ్‌లో రాజకీయ ఉద్రిక్తత కొంతవరకు సడలినట్లే కనిపించినా ఎదురుతిరిగిన నాయకుడు శ్రీ కంథరాంఆర్యానుగురించి క్రమశిక్షణా

పార్లమెంటు ఎదుట నిరసన ప్రదర్శన

ఆగస్టు 25న భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యాన

మంగుళూరు, ఆగస్టు 12

ఢిల్లీని ఇటీవల "ఏ" తరగతి నగరంగా మార్చినందువల్ల ప్రభుత్వోద్యోగులకు కలిగిన సౌకర్యాలను ప్రైవేటు రంగానికిగూడ విస్తరింపచేయడంలో ప్రభుత్వం విఫలమైందని, అందుకు వ్యతిరేకంగా ఆగస్టు 25వ తేదీన పార్లమెంటు ఎదుట తమ పార్టీ ప్రదర్శనలు చేస్తుందని భారతీయ మజ్దూర్ సంఘ్ ప్రధానకార్యదర్శి శ్రీ డి. బి. ఠేంగాడి నేడిక్కడ అన్నారు.

ఢిల్లీలో జరపబోయే ప్రదర్శనకు తాను నాయకత్వం వహించబోతున్నానని ఆయన అన్నారు.

పత్రికావిలేకరులతో మాట్లాడుతూ ఆయన ఇంకా ఇలా అన్నారు:

"ఈ విషయంపై సంఘ తీర్మానాలు చేసి అధికార్లకు పంపింది. కాని ఎలాంటి సమాధానమూ రాలేదు.

దేశం మొత్తంమీద మద్రాసు, నాగపూర్ నగరాల్లో జీవనవ్యయం ఎక్కువ అందువల్ల అక్కడి కార్మికులకు కూడా ఆ సదుపాయాలను కలిగించాలి"

సంఘం చేసిన ఫిర్యాదుల విషయంలో రాజస్థాన్ కాంగ్రెసు మాత్రం అతి తీవ్రంగా రెండుగా చీలిపోయింది.

అస్సాంలో వరదలనుగురించి కూడ కాంగ్రెసు కార్యవర్గం ఆలోచిస్తుంది.

సోవియట్ సహాయంతో బర్మా ప్రభుత్వం ఒక ఎరువుల ఫ్యాక్టరీని స్థాపిస్తున్నది.

ఎందుచేత ప్రజలు ఎంచుకొంటారు

సపట్ లోషన్

తేలిక చర్మ వ్యాధులకు

గోకుట, పుండ్లుపడుట. తామర మరియు పొడిగజ్జి మొదలగువాటికి

ఇది అతిత్వరగా పనిచేయును.

ఉపయోగించుట మరియు తరవాత తుడిచి వేయుట బహుతేలిక.

మచ్చ పడదు - జిగురుగా నుండదు

తయారు చేయువారు: సపట్ అండ్ కంపెనీ. బొంబాయి-2

ఏజెంటు: ది ట్రేడ్ ప్రమోటింగ్ కార్పొరేషన్

పో. బా. నెం 350 — విజయవాడ - 2

గుణము నిచ్చుటకు! గ్యారంటీ కొరకు!

కొనండి!

ప్యారీస్ ఎరువులు - ప్రథమశ్రేణికి చెందినవి

అమోనియంఫాస్ఫేట్
సూపర్‌ఫాస్ఫేట్
బోన్‌సూపర్‌ఫాస్ఫేట్
అన్నిరకాల పంటలకు
ఎరువులమిశ్రమములు
మరియు
ఇన్‌సెక్టిసైడ్స్ &
ఫంగిసైడ్స్

Parry's

వివరాలకు:

ది ఈస్ట్ ఇండియా డిస్టిలరీస్
& షుగర్ ఫ్యాక్టరీస్ లిమిటెడ్
పోస్టుబాక్సు 12. మద్రాస్-1

లేక

ది ఈస్ట్ ఇండియా డిస్టిలరీస్
& షుగర్ ఫ్యాక్టరీస్ లిమిటెడ్
పోస్టుబాక్సు 45. గుంటూరు-4

జ్ఞానం అంటే....

జ్ఞానంయొక్క స్వభావమెట్టిది?

జ్ఞానం ఎలా అభివృద్ధి చెందుతుంది?

సరియైన జ్ఞానమెలా సంపాదించగలం?

భావాలెలా పరిణామం చెందుతాయి?

ఇత్యాది క్లిష్టసమస్యలపై ప్రతిభావంతమైన పరిశీలనలు జరిపిన ప్రఖ్యాత తత్వవేత్త

మారిస్ కారన్‌ఫోర్త్ గ్రంథం

జ్ఞాన సిద్ధాంతం

అనుసరణ: శ్రీ పాములపర్తి సదాశివరావు

344 పుటలు; వెల: రు. 3-75

రిజిస్టర్డ్ పోస్టేజి ప్రత్యేకం 0-75

ప్రతులకు:

విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ-4
[illegible]ంధ్ర సేల్స్‌డిపో, బిసెంటురోడ్, విజయవాడ-2
పీపుల్స్ బుక్‌హౌస్, నెహ్రూరోడ్, హైద్రాబాద్.